Follow: @ANNTELUGU
29-09-2026
ANN తెలుగు
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 248 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## ఎస్ఐఆర్ అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో
# మహా ధర్నా

- జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుండి భారీ ర్యాలీ
- పెద్ద సంఖ్యలో కలెక్టరేట్ వద్ద బైఠాయింపు
- ఈసీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు
- నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట
- కాసేపు ఉద్రిక్త పరిస్థితి
- తోపులాటలో కంది శ్రీనివాస రెడ్డి మణికట్టుపై స్వల్ప గాయాలు

03

**టాప్ న్యూస్**

## రకుల్ ప్రీత్ సింగ్ ఇంట్లో ఐటీ సోదాలు



- 12 ప్రాంతాల్లో తనిఖీలు
- విదేశీ లావాదేవీలపై ఆరా

02

## ఖైరతాబాద్ ఉప ఎన్నికలో దిమ్మ తిరిగే ఫలితాలు



- దానం సంచలన కామెంట్స్

02

## 'బేర్'మన్న స్టాక్ మార్కెట్లు

రూ.8 లక్షల కోట్లు ఆవిరి



02



### ఖైరతాబాద్ ఖాళీ
# నవంబర్‌లో ఉప ఎన్నిక

- కర్నాటకలోని హిరియూర్ తో కలిసి బైపోల్
- మంత్రి మరణంతో కర్నాటకలో అసెంబ్లీస్థానం ఖాళీ
- రెండింటికీ ఒకేసారి షెడ్యూల్ వచ్చే అవకాశం

**హైదరాబాద్, మహా** ఖైరతాబాద్ ఎమ్మెల్యే స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. 2024 ఏప్రిల్ 23 నుంచి ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు అందులో పేర్కొన్నారు. హైకోర్టు తీర్పునకు అనుగుణంగా సెప్టెంబర్ 26వ తేదీతో గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో ఏ క్షణమైనా షెడ్యూల్ రావొచ్చు. నిబంధనల ప్రకారం ఆరు నెలలలోపు ఖాళీ అయిన స్థానానికి ఎన్నిక జరగాల్సి ఉంది. సాధారణంగా ఎన్నికల కమిషన్ ఖాళీగా ఉన్న స్థానాలన్నింటికీ కలిపి షెడ్యూల్ విడుదల చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది మే10న కర్నాటక మంత్రి, హిరియూర్ ఎమ్మెల్యే డి.సుధాకర్ మరణించారు. దీంతో నిబంధనల ప్రకారం నవబంర్ 10లోగా కర్నాటక ఎమ్మెల్యే స్థానం ఎన్నిక పూర్తవ్వాల్సి ఉంది. దీంతో కర్నాటక లో ఖాళీ అయిన ఎమ్మెల్యే స్థానం కోసం తెలంగాణ అసెంబ్లీలో ఖాళీ అయిన స్థానాన్ని కలిపే అవకాశం కనబడుతోంది. ఈ లెక్కన నవంబర్ మొదటివారంలోనే ఈ ఎన్నిక జరిగే అవకాశం ఎక్కువగా కనబడుతోంది. తెలంగాణలో గతంలో జరిగిన ఉప ఎన్నికలకు ఎక్కువగా నవంబర్ లోనే నోటిఫికేషన్ లు వచ్చాయి. దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు, జూబ్లీహిల్స్ వంటి ఎన్నికలన్నీ అదే సీజన్ లో వచ్చాయి. ఇపుడు ఖైరతాబాద్ కూడా అదే సీజన్ ఖాయమయ్యే సూచనలున్నాయి. నవంబర్ లో ఖైరతాబాద్ ఎలక్షన్ జరిగితే డిసెంబర్ లో జీహెచ్ఎంసీ ఎన్నికలు కూడా జరిగే ఛాన్స్ ఉంది.

**బరిలో ఎవరు?**

ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం నుండి తాజా మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు కాంగ్రెస్ పార్టీ నుండి ఛాన్స్ దక్కే అవకాశముంది. పార్టీలోకి వచ్చి సభ్యత్వం కోల్పోయిన నేతకు పార్టీ అండగా నిలిచే అవకాశముంది. ఈ స్థానాన్ని గత ఎన్నికల్లో పోటీచేసిన విజయారెడ్డి కూడా మిగతా 2వ పేజీలో



## తిరుమల శ్రీవారి హుండీకి భారీ ఆదాయం

- ఒక్కరోజే రూ. 5.07 కోట్లు!
- స్వామివారిని దర్శించుకున్న 83 వేల మందికి పైగా భక్తులు
- రికార్డు స్థాయిలో 4.39 లక్షల లడ్డూల విక్రయం
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు ఫుల్.. శిలాతోరణం వరకు క్యూలైన్లు
- టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి 18 గంటల సమయం

02

# మాది హరహర మహాదేవ్..
# వారిది జై శ్రీరామ్



### మేము.. పేదలవైపు శివుడిని కొలుస్తాం.. వారు సంపన్నులవైపు రాముడిని కొలుస్తారు

- తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ సహకరించడం లేదు
- ది కాంక్లేవ్ 2026 లో సీఎం రేవంత్ రెడ్డి
- నార్త్ వర్సెస్ సౌత్ కాదు.. గుజరాత్ వర్సెస్ దేశం అన్నట్లుగా పరిస్థితి
- డీలిమిటేషన్ జరిగితే సౌత్ కు మరణశాసనమే
- 50శాతం ప్రతిపాదన ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు
- నేను అసెంబ్లీకి వెళ్ళిన దానికంటే.. జైలుకెళ్ళిందే ఎక్కువ

**ఢిల్లీ, మహా :**

తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ సహకరించడం లేదని, ఆర్ఆర్ఆర్‌కు టెండర్ల సమయానికి కేంద్రం అనుమతులను అడ్డుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. గుజరాత్ సీఎంగా మోదీ ఉన్నపుడు ప్రధానిగా మన్మోహన్ ఎంతో సహకరించారని, తనకు అలాంటి సహకారం అందడం లేదన్నారు. నార్త్ వర్సెస్ సౌత్ కాదు గుజరాత్ వర్సెస్ దేశం అన్నట్లుగా పరిస్థితి ఉందని విమర్శించారు. యూపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మోదీ నిధులు గుజరాత్‌కు మళ్లిస్తున్నారని ఆరోపించారు ఢిల్లీలో అస్సాం ప్రతిదిన్ మీడియా నెట్‌వర్క్ నిర్వహిస్తున్న 'ది కాంక్లేవ్ 2026'లో పాల్గొన్న సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్‌లో జనాభా మిగతా 2వ పేజీలో

> "రాష్ట్ర విభజన తర్వాత నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఉండడంతో తెలుగుదేశం పార్టీకి తెలంగాణలో ప్రాధాన్యం తగ్గిపోయింది. మీరు మంచి నాయకుడు, మీరు చంద్రబాబు నాయుడుతో కలిసి పని చేస్తే తెలంగాణలో ఇబ్బంది అని ప్రజలు చెప్పారు. దాంతో నేను కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నాను. తెలుగుదేశం కేంద్రంలో ఎన్డీఏతో ఉంది. ఏపీలో ఎన్డీఏ ఉంది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంది. నేను రెండింటితో పోరాడాల్సి ఉంది. రాహుల్ గాంధీ, దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్ తో పాటు నా శ్రేయోభిలాషులు కాంగ్రెస్‌లో ఉన్నారు. రాష్ట్రంలో 2014 ఎన్నికల తర్వాత పోటీ కేసీఆర్, రేవంత్ మధ్య పోటీగా మారింది. ఆయన నన్ను అనేక సార్లు జైలుకు పంపారు. నేను అసెంబ్లీకి కన్నా జైలుకే ఎక్కువ సార్లు పోయా. రాహుల్ గాంధీని కలిసిన తర్వాత 15 నిమిషాలు మాట్లాడాం. ఆ రోజే ఆయన నా నాయకుడి అని నిర్ణయించుకున్నా. రాహుల్ గాంధీకి ఎటువంటి వ్యక్తిగత అజెండాలు లేవు. ఆయనకు దేశమే ముఖ్యం. నేను విద్యార్థి సంఘంలో ఉన్నా. చంద్రబాబు నాయుడు పార్టీలో ఉన్నా దేశం, రాష్ట్రం కోసం ఏదైనా చేయాలనుకున్నా"
>
> - రేవంత్ రెడ్డి, సీఎం

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా
# తలసాని సాయికిరణ్ ?



- హైదరాబాద్ -రంగారెడ్డి-పాలమూరు స్థానంపై
- కేటీఆర్ కీలక సమావేశం
- వరంగల్ కు రాకేష్.. హైదరాబాద్ కు సాయికిరణ్?

**హైదరాబాద్, మహా :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీస్థానాలకు అభ్యర్థులపై బీఆర్ఎస్ కసరత్తు ముమ్మరం చేసింది. వరంగల్ ఖమ్మం నల్లగొండ స్థానానికి గతంలో పోటీ చేసిన ఎనుగుల రాకేష్ రెడ్డి పేరు దాదాపు ఖాయం కాగా, హైదరాబాద్ రంగారెడ్డిపాలమూరు స్థానానికి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ తనయుడు సాయికిరణ్ పేరును పార్టీ పరిశీలిస్తోంది. వరంగల్ స్థానానికి సంబంధించి పార్టీ సర్వేలో రాకేష్‌రెడ్డి పేరు ముందు ఉండగా, హైదరాబాద్ రంగారెడ్డి స్థానానికి పలు పేర్లు పరిశీలించగా, తలసాని సాయికిరణ్ పేరు ముందువరుసలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకటి ఓసీకి, మరొకటి బీసీకి మిగతా 2వ పేజీలో



## నోటీసులు బేఖాతర్.. రెస్టారెంట్లపై టీజీ సేఫ్ కొరడా

- లైసెన్సులు సస్పెండ్ చేసినా దర్జాగా వ్యాపారం.
- వంటగదుల్లో ఎలుకలు.. బొద్దింకలు.. పాడైన ఆహారం.

02



## బీసీ సంక్షేమానికి పెద్దపీట

- నవంబర్ నుంచి 'రాజీవ్ యువ వికాసం'
- విద్యార్థుల ఖాతాల్లోకి నేరుగా రూ.450 కోట్లు జమ
- విదేశీ విద్య దరఖాస్తుల గడువు అక్టోబర్ 15 వరకు పొడిగింపు
- బీసీ సంక్షేమ శాఖ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

02

### భూ సమస్య పరిష్కారానికి
# రీసర్వే ఏకైక మార్గం
## ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలతో తొలి దశ సర్వే

- నక్షాలు లేని మరో 413 గ్రామాల్లోనూ సమగ్ర భూసర్వే
- దశాబ్దాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూ భారతి లక్ష్యం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

02






మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS | మంగళవారం, హైదరాబాద్ | 29-09-2026
ANN తెలుగు

ఖైరతాబాద్ ఖాళీ

# నవంబర్‌లో ఉప ఎన్నిక

మొదటి పేజీ తరువాయి

ఆశిస్తున్నారు. అయితే దానంకు ఇచ్చేందుకు పార్టీ మొగ్గు చూపే అవకాశముంది. బీఆర్ఎస్ టికెట్ ను పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జి మన్నె గోవర్ధన్ రెడ్డికి ఇచ్చే అవకాశాలున్నాయి. ఉద్యమనేత, కేసీఆర్ కుటుంబానికి ఆది నుండీ విధేయుడిగా ఉండడం కలిసొచ్చే అంశాలుగా చెబుతున్నారు. ఈ సీటును మాజీ మంత్రి తలసాని తనయుడు సాయికిరణ్ ఆశిస్తున్నా మెజారిటీ నేతల మొగ్గు ఎంజీఆర్ వైపే కనబడుతోంది. బీజేపీ నుండి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మరోసారి బరిలోకి దిగేందుకు రెడీ అయ్యారు. సోమవారం సాయంత్రం కార్యకర్తల సమావేశం కూడా నిర్వహించారు.

## ఖైరతాబాద్ ఉప ఎన్నికలో దిమ్మ తిరిగే ఫలితాలు

**దానం సంచలన కామెంట్స్**

**ఖైరతాబాద్, మహా ):** ఖైరతాబాద్ ఉప ఎన్నికపై దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సర్ ప్రభావం ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉండదని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద మీడియాతో దానం నాగేందర్ మాట్లాడారు. ఉప ఎన్నికలో దిమ్మ తిరిగే రిజల్ట్స్ వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఎవడు కొడితే మైండ్ బ్లాక్ అవుతుందో.. అలా రిజల్ట్స్ ఉంటాయని కుండ బద్దలు కొట్టారు. బీజేపీ సీఈసీని అడ్డంపెట్టుకొని ఓటు చోరీకి పాల్పడుతోందని దానం నాగేందర్ ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఓటు చోరీతోనే గెలిచారని ఆరోపణలు చేశారు. ఓటు చోరీకి పాల్పడకపోతే కిషన్‌రెడ్డి అసలు గెలిచేవారే కాదని చెప్పుకొచ్చారు.



## రకుల్ ప్రీత్ సింగ్ ఇంట్లో ఐటీ సోదాలు

**ముంబై, మహా :** బాలీవుడ్ నటి రకుల్‌ప్రీత్ సింగ్, నిర్మాత వాసు భగ్నానీ, పనోరమా స్టూడియోస్‌కు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. ముంబైలో మొత్తం 12 ప్రాంతాల్లో ఈ తనిఖీలు జరిగాయి. సినిమా ప్రాజెక్టులకు సంబంధించిన నిధుల లావాదేవీలు, ముఖ్యంగా విదేశాలకు పంపిన నిధులపై తలెత్తిన అనుమానాల నేపథ్యంలో ఈ సోదాలు జరిగినట్లు సమాచారం. ఆర్థిక పత్రాలు, ఖాతాలకు సంబంధించిన రికార్డులు, ఇతర సంబంధిత డాక్యుమెంట్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అయితే సోదాల్లో ఏం గుర్తించారన్న విషయంపై ఆదాయపు పన్ను శాఖ అధికారికంగా వివరాలు వెల్లడించలేదు. సినిమా నిర్మాణం, ప్రాజెక్టుల కోసం నిధుల సమీకరణ, వాటి విదేశీ లావాదేవీలకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలించారని నివేదికలు పేర్కొంటున్నాయి. పనోరమా స్టూడియోస్‌తో పాటు నిర్మాతలు, సినీ రంగానికి చెందిన వ్యక్తులకు సంబంధించిన కొన్ని కార్యాలయాలు, నివాస ప్రాంతాల్లోనూ తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. రకుల్‌ప్రీత్ సింగ్ సోదరుడు అమన్‌ప్రీత్ సింగ్ పేరు 2025 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నమోదైన డ్రగ్స్ కేసులో తెరపైకి వచ్చింది. డిసెంబర్ 19న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 43.7 గ్రాముల కొకైన్, 11.5 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. విచారణలో అమన్‌ప్రీత్ సింగ్ పేరు వినియోగదారుల్లో ఒకరిగా వెల్లడైందని పోలీసులు అప్పట్లో తెలిపారు. ఆయన ఆ ఇద్దరి నుంచి ఐదుసార్లు డ్రగ్స్ కొనుగోలు చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానించినట్లు వార్తా సంస్థలు పేర్కొన్నాయి.

# మాది హరహర మహాదేవ్.. వారిది జై శ్రీరామ్

( మొదటి పేజీ తరువాయి )




మేరకు సీట్లు పెంచితే పెద్ద రాష్ట్రాలకు మేలని చిన్న రాష్ట్రాలకు నష్టమని తెలిపారు. సౌత్ కు దీనివల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందని, 50శాతం పెంపు ప్రతిపాదన సౌత్ కు మరణశాసనమన్నారు.

**మాది హరహరమహాదేవ.. వారిది జై శ్రీరామ్**

మేము ద్రావిడులం, వారు ఆర్యులు. మేము శివుడి భక్తులం, వారు శ్రీరాముడి భక్తులు. వారు "జై శ్రీరామ్" అని అంటారు.. మేము "హర హర మహాదేవ్" అని అంటావ్. బీజేపీ శ్రీరాముడిని తమ రాజకీయాలకు పరిమితం చేసుకుంది. మోదీ లేదా బీజేపీ నాయకులు "హర హర మహాదేవ్" అని నినదించడం చాలా అరుదు. శివుడిని సామాన్య ప్రజలు, పేదల దేవుడిగా భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. మేం హరహరమహాదేవ్ అంటాం. తెలంగాణలో ప్రముఖ శివాలయం " వేములవాడ ఆలయాన్ని, మరియు దక్షిణాది అయోధ్యగా పిలువబడే భద్రాచల రామాలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం. అంటూ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

**ఎస్ఐఆర్ గోబ్యాక్**

పేదల ఓటు హక్కు తొలగించడానికే ఎస్ఐఆర్ తీసుకొచ్చారని, 2029 ఎన్నికల కోసం దేశంలో 13 కోట్ల ఓట్లు తొలగించారని సీఎం రేవంత్ ఆరోపించారు. బ్రిటిషర్లు సైమన్ కమిషన్ తెచ్చినట్లు ఈసీని మోదీ వాడుకుంటున్నారని ఆక్షేపించారు. దేశంలో జనాభా తగ్గకుండా ఓట్లు మాత్రమే ఎలా తగ్గుతాయని ప్రశ్నించారు. తనకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లు తొలగించాలని మోదీ ప్రయత్నిస్తున్నారని, దేశంలో 20 కోట్ల ఓట్లు తొలగించాలని చూస్తున్నారని వెల్లడించారు. మొత్తం అధికారాలను దిల్లీలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు ఇచ్చారని అన్నారు. మరి బీఎల్ఏలు, బీఎల్‌వోలు, కలెక్టర్లు ఎందుకని నిలదీశారు. ఎస్ఐఆర్ గోబ్యాక్ అని నినదిస్తూ దేశమంతా ఏకం కావాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

**బీజేపీకి తెలంగాణలో ప్రాధాన్యం లేదు**

తెలంగాణలో విద్యార్థి సంఘాలు చాలా తక్కువని, లెఫ్ట్, రైట్ సంఘాలున్నాయని సీఎం తెలిపారు. ఎన్ఎస్ఐయూ ప్రభావం పెద్దగా లేదని, ఉత్తర భారతదేశంలో, దక్షిణ భారతదేశంలో రాజకీయాల శైలి వేరని, మా దగ్గర యూనివర్సిటీ లా కాలేజ్, ఆర్ట్స్ కాలేజీ నాయకునిగా ఏబీవీపీలో గెలిచిన వారు తర్వాత కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని గుర్తు చేశారు. యూనివర్సిటీలో విద్యార్థి సంఘంలో ఉన్నా, గ్రామానికి వెళ్లిన తర్వాత ఆ కుటుంబం కాంగ్రెస్‌లోనే ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదని పేర్కొన్నారు. స్టూడెంట్ రాజకీయాల్లో ఏబీవీపీ ప్రభావం ఉంటే రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రభావం ఉంటుందని వెల్లడించారు.

**దేశం కోసం.. రాష్ట్రం కోసం**

తాను 2006లో జడ్పీటీసీ సభ్యునిగా, 2007లో ఎమ్మెల్సీగా ఇండిపెండెంట్‌గా గెలిచానని తెలిపారు. ఆ రెండు సార్లు తాను కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించానని గుర్తు చేసుకున్నారు. అక్కడ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలే ఉన్నాయని, తనకు జిల్లాలో కాంగ్రెస్ నాయకులతో పెద్దగా సంబంధాలు పెద్దగా లేవని అన్నారు. ప్రభుత్వంపై పోరాడాలంటే ప్రతిపక్షమే మేలని భావించానని, అందుకే తాను తెలుగుదేశంలో చేరానని తెలిపారు. ఆ పార్టీ నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా గెలిచానని, 2017లో కాంగ్రెస్‌లో చేరానని, 2019లో ఎంపీగా గెలిచానని వెల్లడించారు. విద్యార్థి సంఘం, టీడీపీ, కాంగ్రెస్ నేను ఎక్కడ ఉన్నా దేశం, రాష్ట్రం కోసం పనిచేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లో కొనసాగుతున్నా' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## భూ సమస్య పరిష్కారానికి రీసర్వే ఏకైక మార్గం



**వనపర్తి, మహా :** రాష్ట్రంలో భూసమస్యల శాశ్వత పరిష్కారానికి భూసర్వే ఏకైక పరిష్కారమార్గమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గనిర్దేశం ప్రకారం భూసమస్యలకు సంబంధించి దీర్ఘకాలిక సమస్యల్లో కొన్నింటిని ఇప్పటికే పరిష్కరించడం జరిగిందని త్వరలో మరికొన్నింటికి పరిష్కారం చూపిస్తామన్నారు. భూ భారతి చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి భూ పార్శిల్‌కు ప్రత్యేక గుర్తింపు, జియో కోఆర్డినేట్స్‌తో కూడిన మ్యాప్, ఎల్‌పీఎం నంబర్ అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి వివరించారు. వనపర్తిలో సోమవారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ , హౌసింగ్ అంశాలపై సమీక్ష అనంతరం మంత్రి పొంగులేటి తన సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ధరణి చట్టం వల్ల ప్రజలకు కలిగిన అసౌర్యాలు,అవస్థలను రూపుమాపుతూ భూభారతి పోర్టల్ లో పేర్కొన్నవిధంగా భూధార్ కార్డులను అందించడమే ధ్యేయంగా ఈ ప్రజా ప్రభుత్వం సర్వే కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. భూ భారతి కింద 70 రెవెన్యూ గ్రామాలను తొలి దశలో సర్వేకు ఎంపిక చేయగా, రాష్ట్రంలో నక్షాలు అందుబాటులో లేని సుమారు 413 రెవెన్యూ గ్రామాలను కూడా దశలవారీగా సర్వే చేసే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. భూ సర్వేను వేగవంతం చేసేందుకు అత్యాధునిక సాంకేతిక పరికరాలను ప్రభుత్వం పెద్ద ఎత్తున సమకూర్చిందని తెలిపారు. తొలి దశలో కొనుగోలు చేసిన రోవర్లతో పాటు రెండో దశలోనూ అదనపు రోవర్లను సమకూర్చి, జిల్లాల వారీగా అవసరానికి అనుగుణంగా అందిస్తున్నామన్నారు. అలాగే వేలాది మంది సర్వేయర్లకు లైసెన్సులు మంజూరు చేసి క్షేత్రస్థాయిలో సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సర్వేయర్లు ఎలాంటి రాజకీయ ప్రచారాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వ కార్యక్రమంలో భాగస్వాములై రైతులకు శాశ్వత ప్రయోజనం చేకూర్చాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా సాగులో ఉన్నప్పటికీ సరైన టైటిల్ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల సమస్యలను కూడా గుర్తించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, నివాస ప్రాంతాలు, అబాది ఆస్తులపై గతంలో విస్తీర్ణానికి సంబంధించిన స్పష్టమైన మ్యాపింగ్ లేకపోయిన సందర్భాలు ఉన్నాయని మంత్రి చెప్పారు. ఇకపై సర్వే ద్వారా ఆ ఆస్తి ఎన్ని గజాల్లో ఉంది, దాని హద్దులు ఎక్కడున్నాయి అనే వివరాలను మ్యాప్‌తో సహా రికార్డుల్లో పొందుపరుస్తామని తెలిపారు. భూ భారతి చట్టం అబాది, వ్యవసాయేతర భూములకు ప్రత్యేక రికార్డులు నిర్వహించడం, వాటి మూలలను జియోకోఆర్డినేట్లతో మ్యాప్ చేయడం కోసం నిబంధనలు కలిగి ఉందని వివరించారు.

**ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయాలకు తావులేదు**

భూ సమస్యల పరిష్కారంతో పాటు పేదల సొంతింటి కలను సాకారం చేయడంలోనూ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి తెలిపారు. తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే రెండు లక్షలకు పైగా ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లను కూడా లక్ష్యబద్ధంగా పూర్తి చేస్తామని చెప్పారు. రెండో విడతలో నిర్మాణం ప్రారంభించే ఇళ్లలో గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పేదల ఇళ్లకు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. "ఊరు గుడిసె లేని రాష్ట్రం" చేయాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రెండో విడతలో అవకాశం రాని అర్హులైన పేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆర్థిక పరిస్థితులు ఎన్ని సవాళ్లు ఎదురైనా మూడో విడత, నాలుగో విడతల ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

## బీసీ సంక్షేమానికి పెద్దపీట.

**హైదరాబాద్, మహా :** బీసీ సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్‌లో సోమవారం బీసీ సంక్షేమ శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు చెల్లించే ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలను ప్రభుత్వం ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తోందని భట్టి తెలిపారు. ఈ విధానం ద్వారా ఇప్పటికే 1.30 లక్షల మంది విద్యార్థుల ఖాతాల్లో ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రూ.450 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. అలాగే, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఏ నెలకు సంబంధించిన డైట్, కాస్మెటిక్ ఛార్జీలను అదే నెలలో వారి ఖాతాల్లో జమ చేయాలని, నిధుల విడుదలలో ఎలాంటి జాప్యం ఉండకూడదని అధికారులను స్పష్టంగా ఆదేశించారు. బీసీ వర్గాల్లోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, వారిని ఆర్థికంగా ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంతో రూపొందించిన 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని నవంబర్ నుంచి ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో పారదర్శకంగా పరిశీలించి, అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. మరోవైపు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించే బీసీ విద్యార్థులకు అందించే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద ఈ ఏడాది రెండు విడతల్లో 180 మందికి రూ.18.40 కోట్లు విడుదల చేశామన్నారు. అర్హులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా దరఖాస్తు గడువును అక్టోబర్ 15 వరకు పొడిగిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

గీత కార్మికుల భద్రత కోసం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'కాటమయ్య రక్షణ కవచం' పథకం కింద రూ.60 కోట్ల వ్యయంతో 50 వేల మందికి రక్షణ కిట్లు మంజూరు చేయగా, ఇప్పటికే 40 వేల మందికి పంపిణీ చేసినట్లు భట్టి వివరించారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న మరో 10 వేల మందికి శిక్షణ పూర్తయిన వెంటనే కిట్లు అందజేస్తామన్నారు. ఈ సమీక్షలో పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాలకు సొంత భవనాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా, ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. గురుకులాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరలోనే క్లియర్ చేయడంతో పాటు, వివిధ బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. సమావేశంలో ఆ శాఖ ముఖ్య కార్యదర్శి బాలామాయదేవి, గురుకులాల కార్యదర్శి సైదులు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తలసాని సాయికిరణ్ ?

(మొదటి పేజీ తరువాయి )



ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుండి పీవీ నరసింహారావు కుమార్తె సురభి వాణిదేవి ప్రస్తుతం అభ్యర్థిగా ఉండగా, ఆమెకు మరోసారి పోటీకి ఆసక్తి లేకపోవడంతో కేసీఆర్ ఆ స్థానంలో హైదరాబాద్, రంగారెడ్డిలను ప్రభావితం చేసే తలసాని కుటుంబానికే టికెట్ ఇవ్వాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి నియోజకవర్గ ఇన్ ఛార్జిగా ఉన్న మన్నె గోవర్ధన్ రెడ్డి వైపు కేసీఆర్ మొగ్గు చూపుతుండగా, మరో నియోజకవర్గానికి చెందిన తలసాని సాయికిరణ్ కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పోటీ నివారించడంతో పాటు ఓటర్ ఎన్‌రోల్ మెంట్ ను సమర్థంగా చేయించే సామర్థ్యం గల సాయికిరణ్ కు అవకాశం ఇవ్వాలని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. వరంగల్ కు సంబంధించి రాకేష్ బలమైన అభ్యర్థిగా ఉండగా, హైదరాబాద్‌రంగారెడ్డికి సాయికిరణ్ బలమైన అభ్యర్థి అవుతాడని భావిస్తున్నారు. రెండు స్థానాలు గతంలో బీఆర్ఎస్ గెలుచుకోగా, ఇపుడు యువనేతల సారథ్యంలో ముందుకు వెళ్ళే సూచనలు కనబడుతున్నాయి. త్వరలోనే పార్టీ దీనిపై అధికారికంగా నిర్ణయం తీసుకునే అవకాశం కనబడుతోంది. హైదరాబాద్ రంగారెడ్డిమహబూబ్ నగర్ స్థానం గెలుపు బాధ్యత కూడా తలసాని పైనే పెట్టాలని కేసీఆర్ భావిస్తున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై నేతల కార్యాచరణ ఎలా ఉండబోతుంది? అధికారిక ప్రకటన నాటికి సమీకరణాలు ఎలా మారుతాయన్నది వేచి చూడాలి.

## తిరుమల శ్రీవారి హుండీకి భారీ ఆదాయం



**తిరుమల, మహా.** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి హుండీకి భక్తులు భారీగా కానుకలు సమర్పించారు. ఆదివారం ఒక్కరోజే శ్రీవారి హుండీ ఆదాయం ఏకంగా రూ. 5.07 కోట్లుగా నమోదైనట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. వారాంతపు సెలవుదినం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో పోటెత్తారు. దీంతో ఈ స్థాయిలో ఆదాయం సమకూరింది.

**రికార్డు స్థాయిలో లడ్డూల విక్రయం..**

టీటీడీ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఆదివారం (సెప్టెంబర్ 27న) మొత్తం 83,578 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వారిలో 31,137 మంది తలనీలాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. నిన్న ఒక్కరోజే రికార్డు స్థాయిలో 4.39 లక్షల శ్రీవారి లడ్డూలను విక్రయించినట్లు అధికారులు తెలిపారు. అలాగే, దాదాపు 2.88 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. అటు తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో 3,631 మంది భక్తులకు వైద్య సేవలు అందించినట్లు అధికారులు పేర్కొన్నారు.

**కొనసాగుతున్న రద్దీ.. దర్శనానికి 18 గంటలు!**

మరోవైపు సోమవారం ఉదయం కూడా తిరుమలలో భక్తుల రద్దీ తీవ్రంగా కొనసాగుతోంది. ప్రస్తుతం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్లు కాంప్లెక్స్ వెలుపల శిలాతోరణం వరకు విస్తరించాయి. ఎలాంటి టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 18 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుమల యాత్రను ప్రణాళిక చేసుకోవాలని అధికారులు భక్తులకు సూచిస్తున్నారు.

## 'బేర్'మన్న స్టాక్ మార్కెట్లు




**హైదరాబాద్, మహా :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం కూడా భారీ నష్టాలు మిగిల్చాయి. ఉదయం నుంచి మొదలైన నష్టాలు గంటలు గడిచే కొద్దీ మరింత తీవ్రమయ్యాయి. అంతర్జాతీయ పరిణామాలు, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ మదుపర్ల అమ్మకాలు మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపించాయి. దీంతో సెన్సెక్స్ ఏకంగా 1,124 పాయింట్లకు పైగా పతనమైంది. నిఫ్టీ కూడా 360 పాయింట్లు కోల్పోయి 23 వేల మార్కుకు దిగువన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 73,734.83 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమైంది. క్రితం సెషన్‌లో 73,895.74 వద్ద ఉన్న సూచీ.. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఒక దశలో 72,716.23 పాయింట్ల కనిష్ఠానికి పడిపోయింది. చివరికి 1,124.02 పాయింట్ల నష్టంతో 72,771.72 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా అదే బాటలో నడిచింది. 360.25 పాయింట్లు కోల్పోయి 22,780.25 వద్ద ముగిసింది. దీంతో 23 వేల మార్కుకు దిగువన స్థిరపడింది. సెన్సెక్స్‌లో ఇన్ఫోసిస్ మినహా మిగిలిన షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఎల్అండ్‌టీ, పవర్‌గ్రిడ్, అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లలో ఎక్కువగా అమ్మకాలు కనిపించాయి. మార్కెట్ల భారీ పతనంతో మదుపర్ల సంపద కూడా గణనీయంగా తగ్గింది. బీఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.8 లక్షల కోట్లు తగ్గి రూ.474 లక్షల కోట్లకు చేరింది. అంటే ఒక్కరోజులోనే మార్కెట్ విలువ పరంగా మదుపర్ల సంపదలో భారీ మొత్తం తగ్గిపోయింది. అయితే ఇది నేరుగా అందరి ఖాతాల్లోని నగదు అంతా పోయిందని అర్థం కాదు. షేర్ల మార్కెట్ విలువ తగ్గడంతో మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ తగ్గింది.

## నోటీసులు బేఖాతర్.. రెస్టారెంట్లపై కొరడా




**హైదరాబాద్, మహా:** నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రతా నిబంధనల అమలుపై టీజీ సేఫ్ అధికారులు దూకుడు పెంచారు. సెప్టెంబర్ 26న మాదాపూర్, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో 20 ఆహార సంస్థల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పది బృందాలతో చేపట్టిన ఈ తనిఖీల్లో పలు చోట్ల తీవ్ర ఉల్లంఘనలు గుర్తించిన అధికారులు 11 సంస్థల ఫుడ్ లైసెన్సులను సస్పెండ్ చేసి, కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు. వంటగదుల్లో బొద్దింకలు, ఎలుకలు, ఎలుకల విసర్జనలు, పాడైన కూరగాయలు, గడువు ముగిసిన పదార్థాలు, ఫంగస్ పట్టిన ఆహారం ఉన్నట్లు గుర్తించారు. ఆహార పదార్థాలను సరైన ఉష్ణోగ్రతల్లో నిల్వ చేయకపోవడం, పరిశుభ్రత లోపాలు, మురుగునీటి పారుదల సమస్యలు కూడా బయటపడ్డాయి. తనిఖీల్లో 21 ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పంపారు. గత కొన్ని వారాలుగా నగరంలో వరుస తనిఖీలు కొనసాగుతున్న నేపథ్యంలో నిబంధనలు పాటించని సంస్థలపై ఇకపై మరింత కఠిన చర్యలు ఉండే అవకాశం ఉంది. నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా ఆదేశాలను పట్టించుకోకుండా వ్యాపారం కొనసాగిస్తే లైసెన్సు, జరిమానా, కార్యకలాపాల నిలిపివేత వంటి చర్యలు ఎదురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆహార నాణ్యత, వంటగది పరిశుభ్రత, నిల్వ విధానాలపై పర్యవేక్షణ కొనసాగనుంది.

# మణికొండలో చెడ్డీ గ్యాంగ్ కలకలం

- అడ్డుకోబోయిన మహిళపై దాడి!
- అపార్ట్‌మెంట్‌లో దొంగతనానికి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠా
- సీసీటీవీలో రికార్డైన ఆరుగురు సభ్యుల దృశ్యాలు.. నెట్టింట వైరల్
- మూడు ప్రత్యేక బృందాలతో నార్సింగి పోలీసుల గాలింపు
- సెక్యూరిటీ గార్డుల పాత్రపైనా ఆరా

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ నగరంలో మరోసారి చెడ్డీ గ్యాంగ్ కలకలం సృష్టించింది. మణికొండ పరిధిలోని ఒక అపార్ట్‌మెంట్‌లోకి చొరబడిన ఈ అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులు చోరీకి పాల్పడ్డారు. దొంగల కదలికలకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

**మహిళపై దాడి..**

వివరాల్లోకి వెళితే.. నిన్న తెల్లవారుజామున ఆరుగురు సభ్యులతో కూడిన చెడ్డీ గ్యాంగ్ మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లోని ఒక బ్లాక్‌లోకి ప్రవేశించింది. ఓ నివాసంలోకి చొరబడి దొంగతనం చేస్తుండగా, గమనించిన ఒక మహిళ వారిని అడ్డుకునేందుకు ధైర్యంగా ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన దుండగులు ఆమెపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ముఠా సభ్యులు అపార్ట్‌మెంట్‌లో సంచరిస్తున్న దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యాయి.

**రంగంలోకి మూడు ప్రత్యేక బృందాలు**

ఈ దొంగతనం ఘటనపై సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ఏకంగా మూడు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ దొంగతనంలో స్థానిక సెక్యూరిటీ గార్డుల పాత్ర ఏమైనా ఉందా? వారితో ఈ అంతర్రాష్ట్ర ముఠాకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలోనూ పోలీసులు తీవ్రంగా విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనతో చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ల వాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.









# ఎస్ఐఆర్ అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో

# మహా ధర్నా











## జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుండి భారీ ర్యాలీ

- పెద్ద సంఖ్యలో కలెక్టరేట్ వద్ద బైఠాయింపు
- ఈసీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు
- నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట
- కాసేపు ఉద్రిక్త పరిస్థితి
- తోపులాటలో కంది శ్రీనివాస రెడ్డి
- మణికట్టుపై స్వల్ప గాయాలు

**ఆదిలాబాద్ మహా :** కేంద్ర ప్రభుత్వానికి చీఫ్ ఎలక్షన్ కమీషనర్ తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆయనను వెంటనే బాధ్యతలనుండి తొలించాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి , డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ డిమాండ్ చేసారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలపై సోమవారం భారీ సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. డీసీసీ కార్యాలయం నుండి ప్లకార్డులు పార్టీ జెండాలు పట్టుకొని భారీ ర్యాలీగా తరలివచ్చారు.కలెక్టర్ కార్యాలయ గేట్ ఎదురుగా బైఠాయించి మోదీ , సీఈసీ జ్ఞానేష్ కుమార్ , కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు.జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ,ఓట్ చోర్ గద్దీ ఛోడ్ మోదీ డౌన్ డౌన్ అంటూ అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా చేపట్టిన ధర్నాలో కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పాలన నాజీ లను హిట్లర్ పాలనను గుర్తుకు తెస్తుందన్నారు. రాజ్యాంగం ప్రకారం ముగ్గురు కమీషనర్లకు సమన హక్కులు ఉన్నా మిగిలిన ఎలక్షన్ కమీషనర్ల సూచనలు పాటించకుండా కేంద్రం అండతో ఈసీ ఒక నియంతలా వ్యవహరిస్తున్నారని మోదీకి తొత్తుగా మారారని ఆరోపించారు.ఎస్ఐఆర్ తో ఓట్లు తొలగించే కుట్ర చేస్తున్నారని విమర్శించారు.భారత దేశ చరిత్రలో మొట్టమొదటి సారిగా దేశవ్యాప్తంగా 13కోట్ల 50లక్షల ఓట్లను కుట్రపూరితంగా తొలగించేందుకు చూస్తున్నారన్నారు. ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసారు. ఎస్ఐఆర్ రెండో విడతలో నోటీసుల పేరుతో ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఓటరు జాబితాలో చిన్న పొరపాటుకు కూడా నోటీసులు పంపించి ఓటర్లను ఆందోళనకు గురయ్యేలా చేస్తున్నారని అన్నారు. ఈ దేశంలోనే ఈ మట్టిలోనే పుట్టిన భారతీయులను ఈ దేశ పౌరులుగా నిరూపించుకోమని చెప్పడం 13కోట్ల 50లక్షల భారతీయ పౌరులను అవమానించడమేనన్నారు. ఈ ఓట్లను కాపాడుకోవడం కోసం మనమంతా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ నిరంకుశ ప్రభుత్వనికి చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. వెంటనే కేంద్ర ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని లేదా ఆయనను తొలగించాలని డిమాండ్ చేసారు. అంతవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేసారు. డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ మాట్లాడుతూ..ఎన్నికల సంఘం విశ్వసనీయతను కాపాడేందుకు ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం, ఓటర్ల హక్కుల పరిరక్షణకు ఎన్నికల సంఘం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల పేర్ల తొలగింపు పునరుద్ధరణ విధానంపై స్వతంత్ర సమీక్ష నిర్వహించాలని కోరారు.అనంతరం ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, కాంగ్రెస్ శ్రేణులకు మధ్య కొంతసేపు తోపులాట చోటుచేసుకుంది. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ తోపులాటలో కంది శ్రీనివాస రెడ్డి మణికట్టు పై స్వల్ప గాయాలయ్యాయి.వెంటనే ఆయన ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించుకున్నారు. అంతకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌక్ , గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ , గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. సీఈసీని తొలగించాలని విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపూరావు, బోథ్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆడే గజేందర్ , మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ , నాయకులు అడ్డి భోజారెడ్డి, గోక గణేష్ రెడ్డి, గంద్రత్ సుజాత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖిజర్ పాషా ,ఆదిలాబాద్ బోథ్, జైనథ్ , ఇచ్చోడ మార్కెట్ చైర్మన్లు శ్రీకాంత్ రెడ్డి , మల్లెపూల సత్యనారాయణ,అశోక్ రెడ్డి, కొమరం సత్యవతి కోటేష్ , ఆత్మకమిటీ చైర్మన్లు గిమ్మ సంతోష్,రాజు యాదవ్, ఆసిఫ్ ఖాన్, పరమేశ్వర్, సేద్మకి ఆనంద్ రావు, అన్నపూర్ణ కపిల్ , మోతిరామ్ షాహిద్ , బూరుగుల మల్లేష్ , రూపేష్ రెడ్డి , పోతా రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, జిల్లా జనరల్ సెక్రెటరీలు , సెక్రటరీలు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు,టౌన్ కాంగ్రెస్ నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్ యూఐ , సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# బాధలో బాసటగా ..
# ఆదిలాబాద్ పట్టణంలో కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు

**పలువురికి ఆర్థిక సాయాలు**

**ఆదిలాబాద్ మహా :** ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నవారి కుటుంబాలకు ,అనారోగ్యంతో బాధపడుతున్న వారి చెంతకు వెళ్లి వారికి కొండంత ధైర్యాన్ని ఇస్తారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి. సోమవారం ఆయన ఆదిలాబాద్ పట్టణంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న రవీంద్ర నగర్ లోని బేల మండలం గూడ గ్రామానికి చెందిన మురళీధర్ టాక్రె, పట్టణంలోని తాటిగూడ కాలనికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాబు బాయ్ , క్రాంతినగర్ కాలనిలో చేతి ఫ్రాక్చర్ తో బాధపడుతున్న బేల మండలం సిర్సన్న గ్రామానికి చెందిన కనిపెల్లి వెంకన్న,హ్యాండిక్యాప్ కాలనికి చెందిన రాసం రాకేష్ నివాసానికి వెళ్లి పరామర్శించారు.



త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాబు బాయ్ , వెంకన్నలకు ఆర్థిక సాయం అందించారు.ఆయన వెంట ఆత్మకమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి , నాయకులు కొండ గంగాధర్, ఇజ్జగిరి సంజయ్, రాందాస్ నాక్లే, దహెగావ్ సర్పంచ్ బొక్రె శంకర్, ఉప సర్పంచ్ మున్నా తదితరులున్నారు.





# అల్యూమినియం షాప్ ప్రారంభోత్సవానికి హాజరైన కంది శ్రీనివాస రెడ్డి

- రిబ్బన్ కట్ చేసి షాప్ ప్రారంభం
- యాజమాన్యానికి అభినందనలు

**ఆదిలాబాద్ మహా :** పట్టణంలోని భుక్తపూర్ కాలనీలో నూతనంగా నెలకొల్పిన అస్లాం కుందన్ అల్యూమినియం షాప్ ను సోమవారం ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సందర్శించారు. యాజయాన్య సభ్యులు ఆయనక బొకేతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.అనంతరం రిబ్బన్ కట్ చేసి షాపును ప్రారంభించారు.యజమాని అస్లాం కుందన్ కు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారం బాగా జరిగి మంచి వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి , నాయకులు కొండ గంగాధర్, ఇజ్జగిరి సంజయ్ తదితరులున్నారు.




## బియ్యం కార్డు వున్న వారందరికీ
# పింఛన్ ఇవ్వాల్సిందే

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత పింఛన్ల పై ప్రకటన చేసింది.బాగానే ఉంది. అన్నిటికి ఆధార్ ప్రామాణికంగా, ఆధార్ అప్డేట్ హిస్టరీ కూడ ప్రవేశ పెట్టారు. ఎందుకంటె చాలా మంది వయసు తక్కువ ఉండి, ఎక్కువ వయసు నమోదు చేసుకుంటున్నారు. ఆధార్ అప్డేట్ తో దీన్ని అరికట్టవచ్చు. ఆ దిశగా చర్యలు తీసుకొనుట మంచిదే. బియ్యం కార్డు పేదలకే ఇస్తున్నారు. కనుక ఎటువంటి కార్డ్స్ తో పని లేకుండా, బియ్యం కార్డు వున్న వారందరికీ పెన్షన్ ఇవ్వాల్సిందే. బియ్యం కార్డు, ఆధార్ కార్డు, ఆధార్ అప్డేట్ హిస్టరీ ఉంటే చాలు. ఈ మూడు ఉంటే చాలు. సచివాలయం లో ఓటర్, మునిసిపల్ ప్రాపర్టీ, కరెంటు బిల్లులు, క్యాస్ట్, ఇన్కమ్,ఇవన్నీ అడుగుతున్నారు. అన్నిటికి ప్రామాణిక అర్హత ఆధార్, బియ్యం కార్డు ఉంటే చాలు. వాటిలోనే వివరాలు అన్నీ ఉంటాయి కదా. సమయం తక్కువ పెట్టి అన్ని సర్టిఫికెట్స్ పెట్టాలి అనేది దారుణం. అసలు బియ్యం కార్డు ఎందుకు ఇస్తారు. పేదలకే కదా ఇచ్చేది. ఉద్యోగులకు ఇవ్వరు. అలాంటప్పుడు ఆది, లేదు, ఇది లేదు అనడం ఎంత వరకు సబబు. రెండో శనివారం, సండే, మండే ప్రభుత్వ సెలవులు వున్నాయి. మూడు రోజులు సెలవులు వుంటున్నాయి. ఆ మూడు రోజులు ఎలాంటి పనులు జరగవు. కనీసం ఇరవై ఐదు రోజులు అయినా సమయం ఉండాలి. ఏదో పెన్షన్ ప్రకటన చేశాం కొట్టుకు చావండి అన్న ఉద్దేశంగా కనపడుతోంది. ఒక ప్రక్క ఓటర్ల సమస్యలు, మరో ప్రక్క పెన్షన్ వాళ్ళు సచివాలయం కిట కిట లాడుతోంది. సచివాలయం సిబ్బంది తప్పించుకొనుటకు సర్వర్ బిజీ అని వస్తోంది అంటూ తప్పించుకుంటున్నారు. తెలిసిన వాళ్ళకు పనులు అవుతున్నాయి. అప్పుడు సర్వర్ పని చేస్తుంది. మొత్తానికి సచివాలయం లో తెలిసిన వాళ్ళు ఉంటే పని తేలిక అనే వదంతి ఉంది. ఇది నగ్న సత్యం. సర్టిఫికెట్స్ కూడా అన్నీ లేకుండా బియ్యం కార్డు ఉంటే చాలు పెన్షన్ కు అర్హుడే అనే ప్రకటన ప్రభుత్వం చేయాలి. రక రకాల సర్టిఫికెట్స్ తెమ్మని వాళ్ళను తిప్పడం మంచిది కాదు.

ఇందులో మరో మతలబు కూడా ఉంది. అదేమిటంటే క్యాస్ట్, ఇన్కమ్ నిర్నిత గడువు దాటితే చెల్లవు. బాగానే ఉంది. వాటి స్థానం లో పాతవి తీసుకుని కొత్తవి ఇస్తే సరిపోతుంది. కొందరికి క్యాస్ట్ సర్టిఫికెట్ వస్తే, మరి కొందరికి ఇన్కమ్ రావడం లేదు. కొత్త ఇన్కమ్ వీర్వో అప్రూవల్ అయి ఆర్ ఐ నుంచి తహసీల్దార్ ఓ . కే చేయాలి. ఇంతలో పుణ్య కాలం గడచిపోతుంది. ఇది చాలా అన్యాయం. బియ్యం కార్డు పేదలకే ఇచ్చేది అటువంటప్పుడుఇన్కమ్ ఎందుకు. క్యాస్ట్ అడిగినా ఒక అర్ధం ఉంది. ఇన్కమ్ అడగటం బాగాలేదు. ఇదంతా ఎలక్షన్ స్టంటు అనే వారు కోకొల్లలు. ఏది ఎమైనా వృద్ధులకు, అరవై ఏళ్ళు దాటిన వారికి, బియ్యం కార్డు వున్న వారందరికీ పెన్షన్ ఇవ్వాల్సిందే. మిగతా వాటికి ఏవో పత్రాలు అడుగుతున్నారు, ప్రభుత్వం కూడా కొన్ని నిబంధనలు పెట్టింది. వాటికి ప్రభుత్వం సూచించిన సర్టిఫికెట్స్ జత చేయాలి. అయితే వృద్ధాప్య పింఛన్ మాత్రం బియ్యం కార్డు, ఆధార్, ఆధార్ అప్డేట్ ఉంటే ఇవ్వాల్సిందే. సచివాలయం సిబ్బంది కి పని ఎక్కువగా ఉంది. అందరూ చుట్టూ కోవడంతో వారికి గాలి కూడా ఆడటం లేదు. ఈ ఇబ్బంది ని గమనించి ప్రభుత్వం ఒక సచివాలయం దగ్గర ఒక పోలీస్ ను పెడితే బాగుంటుంది. ఒక్కొక్కరిని పిలిస్తే పని సులువు అవుతుంది.అందరికి న్యాయం జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే తంతు.. ఇప్పటికే ఇబ్బడ్డి, ముబ్బడిగా వివిధ పెన్షన్స్ అప్లికేషన్స్ వచ్చాయంటే పరిస్థితి అర్ధం చేసుకోవచ్చు.వృద్ధాప్య పెన్షన్ ఆపితే మాత్రం చాలా విమర్శలు వస్తాయి. కనుక ఎటువంటి జాప్యం చేయక బియ్యం కార్డు వున్న వారికి పెన్షన్ సౌకర్యం కలిగిస్తే ప్రభుత్వా నికి మంచి పేరు ఉంటుంది. లేకపోతే ప్రతిపక్షం నుంచి తీవ్ర విమర్శలు వస్తాయి. అందులో వృద్ధాప్య పెన్షన్ రాని వారు అధికార పార్టీకి ఓటు వేయరు. ప్రభుత్వం అలోచించి వృద్ధాప్య పెన్షన్ అప్లై చేసిన వారందరికీ మంజూరు చేయాలి.

**.... కనుమ ఎల్లారెడ్డి,**
**9391523027.**

# వంట నూనెలలో స్వయం సమృద్ధి దిశగా కేంద్ర సర్కార్ దార్శనిక విధానాలు











భారతదేశ వంట నూనెల అవసరాల్లో అత్యధిక భాగం దిగుమతులపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో, దేశీయంగా స్వయం సమృద్ధి సాధించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రగతిశీల, దార్శనిక విధానాలను అమలు చేస్తోంది. పండుగ సీజన్‌లో వినియోగదారులకు వంట నూనెలను అందుబాటు ధరలో ఉంచేందుకు ముడి పామాయిల్, సోయా నూనెలపై ప్రాథమిక దిగుమతి సుంకాన్ని 10% నుండి 5% కి తగ్గించడం ఆహార ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసే ఒక ఆచరణాత్మక ఆర్థిక నిర్ణయం. కేంద్ర ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, వాణిజ్య & పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలో ఈ సమతుల్య విధానం రూపుదిద్దుకుంది. ఒకవైపు సామాన్య వినియోగదారులపై ధరల భారం పడకుండా చూస్తూనే, మరోవైపు రిఫైన్డ్ పామోలిన్‌పై 35.75% వరకు పన్ను కొనసాగించి దేశీయ ఎక్స్‌ట్రాక్షన్ ప్లాంట్లు, రిఫైనరీల నిర్వహణ దెబ్బతినకుండా రక్షణ కల్పించారు.

రైతుల ప్రయోజనాలను కాపాడే బాధ్యతను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పర్యవేక్షణలో కేంద్రం అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తోంది. ఆగస్టు 2021లో రూ. 11,040కోట్ల భారీ వ్యయంతో ప్రారంభమైన "నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ ఆయిల్ పామ్ (NMEOOP)" పథకం కింద 2026 నాటికి దేశవ్యాప్తంగా అదనంగా 6.5 లక్షల హెక్టార్ల విస్తరణ, 11.20 లక్షల టన్నుల క్రూడ్ పామ్ ఆయిల్ (సి.పి.ఒ) ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునే దిశగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. అంతర్జాతీయంగా మార్కెట్ ధరలు పడిపోయినప్పుడు రైతులకు నష్టం కలగకుండా 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వి.జి.ఎఫ్)' విధానాన్ని కేంద్రం గ్యారెంటీగా అమలు చేస్తోంది. పారిశ్రామిక కొనుగోలుదారులు చెల్లించే నెలవారీ ఫార్ములా ప్రైస్ (ఎఫ్.పి) కేంద్రం నిర్ణయించిన వయబిలిటీ ప్రైస్ (వి.పి) కంటే తగ్గితే, ఆ వ్యత్యాసాన్ని ప్రత్యక్ష నగదు బదిలీ (డి.బి.టి) ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. అక్టోబర్ 2022లో ₹10,516 ఉన్న ఈ వయబిలిటీ మద్దతు ధరను వరుసగా పెంచుతూ రైతులకు పూర్తి ఆదాయ భరోసా కల్పించారు. దీనితో పాటు మొక్కలు నాటేందుకు ఇచ్చే సబ్సిడీని హెక్టారుకు రూ. 12,000నుండి రూ. 29,000కు పెంచడం, పాత తోటల పునరుద్ధరణకు మొక్కకు రూ. 250 చొప్పున అదనపు సాయం అందించడం ద్వారా వ్యవసాయ వ్యయాన్ని భారీగా తగ్గించారు.

భారత ప్రభుత్వం కల్పించిన పారిశ్రామిక ప్రోత్సాహకాల ఫలితంగా ప్రముఖ అగ్రిబిజినెస్ సంస్థలు దేశీయంగా ప్రాసెసింగ్ రంగాన్ని బలోపేతం చేస్తున్నాయి. దేశీయ పామాయిల్ ఉత్పత్తిలో సుమారు 30-35% వాటాను కలిగి ఉన్న 'గోద్రెజ్ ఆగ్రోవెట్' ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో 75,000 హెక్టార్లకు పైగా సాగును విస్తరించి, 6 ప్రాసెసింగ్ మిల్లులను నడుపుతోంది. దీనివల్ల దాదాపు 65,000 మంది రైతులకు హెక్టారుకు రూ. 90,000 నుండి రూ. 3,00,000 వరకు స్థిరమైన ఆదాయం సమకూరుతోంది. మరో దిగ్గజ సంస్థ 'పతంజలి ఫుడ్స్' 11 రాష్ట్రాల్లో 90,000 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగును పర్యవేక్షిస్తూ, 50,000 మంది రైతులతో భాగస్వామ్యమై 13.82 లక్షల మెట్రిక్ టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో 5 ఆధునిక మిల్లులను నిర్వహిస్తోంది. 2026 నాటికి భారత దేశం ఈశాన్య, దక్షిణ ప్రాంత రాష్ట్రాల్లో అదనపు మిల్లులను నెలకొల్పి స్థానిక ప్రాసెసింగ్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేస్తోంది.

దేశీయ ఆయిల్ పామ్ ఉత్పత్తిలో 98 శాతం వాటా కలిగిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఈ జాతీయ మిషన్‌లో కీలక చోదక శక్తులుగా నిలుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 10 జిల్లాల్లో 5.31 లక్షల హెక్టార్లు, తెలంగాణలోని 27 జిల్లాల్లో 4.36 లక్షల హెక్టార్ల అపారమైన సాగు సామర్థ్యం ఉన్నట్లు కేంద్ర పరిశోధనలు నిర్ధారించాయి. తెలంగాణలో ఇప్పటికే సుమారు 68,600 ఎకరాలు దిగుబడి దశకు చేరుకోగా, డ్రిప్ ఇరిగేషన్, మొక్కలు, నిర్వహణ కోసం ఎకరాకు సుమారు రూ. 50,918 వరకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహాన్ని అందజేస్తోంది. గెలల ధరలు అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా టన్నుకు రూ. 21,000 దాటి నమోదు కావడం రైతుల్లో స్థైర్యాన్ని నింపుతోంది. 2026 నాటికి ప్రపంచ పామాయిల్ మార్కెట్ విలువ $80.57 బిలియన్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్న తరుణంలో, అంతర్జాతీయంగా ఎదురవుతున్న పర్యావరణ విమర్శలకు భారతదేశం ఆదర్శవంతమైన సమాధానం చూపుతోంది. ఇతర దేశాల వలె అడవులను నరికివేయకుండా, కేవలం వ్యవసాయ మరియు బీడు భూముల్లోనే చట్టబద్ధంగా పంటను సాగు చేస్తోంది. నీటి వనరుల పరిరక్షణ కోసం ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన ద్వారా బిందు సేద్యాన్ని (మైక్రోఇరిగేషన్) తప్పనిసరి చేసి, భూగర్భ జలాల దుర్వినియోగాన్ని అరికడుతున్నారు. భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ (IIOPR) ద్వారా శాస్త్రీయ ఎరువుల నిర్వహణపై రైతులకు నిరంతర అవగాహన కల్పిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం కేవలం ప్రస్తుత అవసరాలకే పరిమితం కాకుండా, రాబోయే దశాబ్ద కాలానికి సరిపడా సుదూర లక్ష్యాలను (ఫ్యూచరిస్టిక్ టార్గెట్స్) నిర్దేశించుకుంది. NMEOOP మిషన్ కింద 202526 నాటికి అదనంగా 6.5 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగును విస్తరించడంతో పాటు, ముడి పామాయిల్ (సి.పి.ఒ) ఉత్పత్తిని 202526 నాటికి 11.20 లక్షల టన్నులకు, 202930 నాటికి ఏకంగా 28 లక్షల టన్నులకు చేర్చాలని బృహత్తర లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, మారుతున్న జీవనశైలికి అనుగుణంగా 202627 నాటికి తలసరి వంట నూనె వినియోగాన్ని సంవత్సరానికి 19 కిలోల వద్ద సమతుల్యంగా ఉంచేలా దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను (ఐ.ఇ.సి కాంపెయిన్స్) ముమ్మరంగా నిర్వహిస్తోంది.

నూనెగింజల ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి భారత సర్కార్ టెక్నాలజీని పెద్దపీట వేస్తోంది. విత్తనాల పంపిణీలో పారదర్శకత కోసం 'సాథీ' అనే ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా 5ఏళ్ల ముందస్తు 'రోలింగ్ సీడ్ ప్లాన్'ను అమలు చేస్తోంది. దేశవ్యాప్తంగా కొత్తగా 65 సీడ్ హబ్‌లు మరియు 50 విత్తన నిల్వ కేంద్రాలను (సీడ్ స్టోరేజ్ యూనిట్లు) ఏర్పాటు చేస్తున్నారు. దీనికి తోడు, ప్రతీ ఏటా 10 లక్షల హెక్టార్ల విస్తీర్ణాన్ని కవర్ చేస్తూ దేశవ్యాప్తంగా 600కి పైగా 'వాల్యూ చైన్ క్లస్టర్లను' గుర్తించారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ల ద్వారా ఈ క్లస్టర్లలోని రైతులకు ఉచితంగా నాణ్యమైన విత్తనాలు, మెరుగైన వ్యవసాయ పద్ధతులపై ఆధునిక శిక్షణ, వాతావరణ, తెగుళ్ల నిర్వహణపై ఎప్పటికప్పుడు సాంకేతిక సలహాలు అందుతున్నాయి.

"సంక్షేమం, సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ కలగలిపిన ఈ భవిష్యత్ కార్యాచరణ నూనెగింజల ఉత్పత్తిలో అద్భుతాలు సృష్టించడం ఖాయం. ఒకవైపు వినియోగదారులకు ధరల నియంత్రణ, మరోవైపు రైతులకు 'వి.జి.పి' ద్వారా నష్టభయం లేని గ్యారెంటీ ఆదాయం, అదే సమయంలో దేశీయ రిఫైనరీలకు రక్షణ.. ఇలాంటి సమగ్ర కార్యాచరణతో మోదీ ప్రభుత్వం వంట నూనెల రంగంలో దేశాన్ని తిరుగులేని ఆత్మనిర్భరత వైపు నడిపిస్తోంది."



(శివ కుమార్ గనివాడ, సీనియర్ అగ్రికల్చర్ అండ్ ట్రేడ్ ఎక్స్‌పర్ట్)
ganiwada@zohomail.in

# సంఘటనకు సజీవ సాక్ష్యం. డాక్టర్ జీ నిరాడంబరతలో వికసించిన 'సమరసతా' తత్వం.

## సమానీ వ ఆకూతిః సమానాని హృదయాని వః
## సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి

మీ అందరి లక్ష్యాలు ఒకటే కావాలి, మీ హృదయాలు ఏకం కావాలి, మీ మనస్సులు ఒకే ఆలోచనతో ఉండి, మీరంతా అద్భుతమైన ఐక్యతతో వర్ధిల్లాలి అని ఉద్ఘోషించే రుగ్వేద మంత్రమే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నిర్మాణానికి పరమ ప్రాతిపదిక. సమాజంలో 'సంఘ్' కార్యకలాపాల గురించి, ఆ సంస్థ నిర్మించిన ఉక్కు లాంటి 'సంఘటన' గురించి ఏమాత్రం అవగాహన లేని వారు బాహ్యంగా ఎన్నో విమర్శనాత్మక వ్యాఖ్యలు చేస్తుంటారు. అయితే, ఆ విమర్శలు చేసే 'నోళ్లు' ఒక్కసారి ఏదైనా సంఘ శాఖకు వెళ్లి, అక్కడి కార్యక్రమాల్లో అప్పుడప్పుడైనా పాల్గొంటే చాలు... ఆ నిస్వార్థమైన క్రమశిక్షణ, సోదరభావం చూసి ఆ వాదాలన్నీ ఆటోమేటిక్‌గా అదుపులో ఉంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు. డాక్టర్ జీ జీవితంలో చోటుచేసుకున్న ఒక ఉద్విగ్నభరితమైన ఘటనే ఈ వాస్తవానికి ఒక చారిత్రక, సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది.

కాలగర్భంలో నిలిచిపోయిన ఆనాటి రాత్రి సుమారు తొమ్మిది గంటల సమయం. ఆరుబయట ఝంఝూమారుతాన్ని తలపించే భీకరమైన చల్లని ఈదురుగాలులు... దానికి తోడు కుండపోతగా కురుస్తున్న వర్షం. కాలు బయటపెడితే జారిపడేలా మహారాష్ట్రలోని ఆ చిన్న పట్టణపు కంకర రోడ్లన్నీ బురదతో నిండిపోయి దుర్భరంగా ఉన్నాయి. అటువంటి అత్యంత ప్రతికూల వాతావరణంలో సైతం, "సంఘ్" కార్య విస్తరణ నిమిత్తం, ఆ సంస్థ ఆద్యులు, మార్గదర్శకులు అయిన డాక్టర్ కేశవరావు బలిరాం హెడ్గేవార్ జీ ఆ పట్టణానికి చేరుకున్నారు. ఆయన బస్సు దిగగానే, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా స్థానిక కార్యకర్తలు అత్యుత్సాహంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. వారిలో ఒక ఉత్సాహవంతుడైన యువ కార్యకర్త ముందుకు వచ్చి, ఎంతో గర్వంగా ఇలా విన్నవించుకున్నాడు, "డాక్టర్ జీ! నగరంలోని అత్యంత గౌరవనీయులు, కుబేరులైన ఒక వ్యాపారవేత్త గారి భవనంలో మీ బస ఏర్పాటు చేశాము. ఆ ప్రాసాదంలో మీకోసం విశాలమైన శయన మందిరంతో పాటు, సకల భోగాలు, అద్భుతమైన రాజభోజనం సిద్ధంగా ఉన్నాయి."

ఆ ఆడంబరమైన మాటలు విన్న డాక్టర్ జీ ముఖంలో ఎలాంటి ఆనందపు రేఖలు కనిపించలేదు. ఆయన అత్యంత ప్రశాంత వదనంతో, "మరి మన స్థానిక శాఖ ముఖ్య శిక్షక్ గారి ఇల్లు ఎక్కడ?" అని ప్రశ్నించారు. ఆ అనూహ్యమైన ప్రశ్నకు ఆ యువ స్వయం సేవక్ కాస్త తటపటాయించి, "డాక్టర్ గారు, ఆయన చాలా నిరాడంబరమైన పేద కుటుంబం నుండి వచ్చారు. ఆయన నివసించేది ఒక చిన్న పూరి గుడిసె. వానొస్తే పైకప్పు కారుతూ ఉంటుంది, కనీసం మీరు కూర్చోవడానికి కూడా అక్కడ సరైన ఏర్పాట్లు లేవు. ఈ వాతావరణంలో మీకు అక్కడ తీవ్ర అసౌకర్యం కలుగుతుంది, అందుకే మీ స్థాయికి తగ్గట్టుగా ఆ భవంతిలో ఏర్పాట్లు చేశాము," అని బదులిచ్చాడు. ఆ మాటలకు డాక్టర్జీ కొన్ని క్షణాలు మౌనముద్ర దాల్చారు. అనంతరం తన చేతిలో ఉన్న చిన్న సంచిని తీసుకుని, పెదవులపై చెరగని చిరునవ్వు చిందిస్తూ ఇలా సెలవిచ్చారు, "నాయనా, చూడండి... నేను ఇక్కడికి భౌతిక సుఖాలు అనుభవించడానికో, లేక ఎవరి సంపదనో, భవనాలనో చూడటానికో రాలేదు. నేను నా సొంత కుటుంబ సభ్యుడిని పరామర్శించడానికి వచ్చాను. ఆ ముఖ్య శిక్షక్ ఎక్కడ నివసిస్తారో... అదే నా నిజమైన ఇల్లు, అదే నా గమ్యం."డాక్టర్జీ నిశ్చలమైన ఆ నిర్ణయానికి స్థానిక



కార్యకర్తలు విస్మయానికి గురయ్యారు. వారు పదేపదే ఆయనను బ్రతిమాలినప్పటికీ, డాక్టర్జీ తన నిర్ణయానికి కట్టుబడి, ఆ బురద దారిలోనే అడుగులు వేసుకుంటూ ఆ నిరాడంబరమైన స్వయం సేవక్ పర్ణశాలకు చేరుకున్నారు. అర్ధరాత్రి వేళ, సాక్షాత్తూ సంఘ్ వ్యవస్థాపకుడే స్వయంగా తన గుమ్మం వద్ద నిలబడి ఉండటాన్ని చూసినప్పుడు ఆ ముఖ్యశిక్షక్ కళ్లలో ఆనందం, తన పేదరికాన్ని తలచుకుని సిగ్గుతో కూడిన కన్నీళ్లు ఉబికి వచ్చాయి. ఆ ఇంట ఖరీదైన పర్షియన్ తివాచీలు గానీ, ప్రత్యేకమైన అలంకరణలు గానీ లేవు. ఒక మూల ఉన్న ఒక పాత చెక్క మంచంపై డాక్టర్జీ ఎంతో సునాయాసంగా, స్వగృహంలో ఉన్నంత స్వేచ్ఛగా కూర్చున్నారు.

సమాజాన్ని నడిపించే ఒక మహానాయకుడికి ఈ పూరి గుడిసెలో ఏమి వడ్డించాలోనని ఆ కార్యకర్త తల్లి, భార్య తీవ్ర సంకోచానికి గురయ్యారు. వారి లోపలి మౌన వేదనను తక్షణమే గ్రహించిన ఆ సున్నిత హృదయుడు, అత్యంత ఆప్యాయంగా, "అమ్మా, మీరు ఇంట్లో వండిన సాదాసీదా భోజనం ఏదైనా సరే తీసుకురండి. ఆత్మీయత ను రంగరించి మీరు వడ్డించే ఇంటి భోజనంలోని రుచి, ఏ రాజభవనంలోనూ ఎప్పటికీ దొరకదు!" అని వారిని గుండెలకు హత్తుకునేలా ఊరడించారు. ఆ రాత్రి, డాక్టర్జీ ఎంతో ఆప్యాయంగా వారు వడ్డించిన జొన్న రొట్టె, చట్నీని అమృతప్రాయంగా స్వీకరించారు. ఎన్నో ఏళ్ల తర్వాత తన సొంత గూటికి చేరిన పెద్దకొడుకులా, ఆయన ఆ రాత్రంతా ఆ కుటుంబ సభ్యులతో కూర్చుని ముచ్చటించారు. పిల్లలను వారి చదువుల గురించి ఆరా తీశారు, కుటుంబ యోగక్షేమాలను విచారించారు. ఆ చిన్న గుడిసెనంతా తన ఆత్మీయతతో, వెచ్చని వాత్సల్యంతో నింపేశారు.

మరుసటి రోజు ఉదయం ఉదయభానుడి కిరణాలతో పాటే డాక్టర్జీ తన తదుపరి పర్యటనకు బయలుదేరుతున్నప్పుడు, ఆ స్వయం సేవక్ కుటుంబమే కాకుండా చుట్టుపక్కల వారందరూ ఆయన చూపిన అకలంకమైన ప్రేమకు, నిరాడంబరతకు మంత్రముగ్ధులయ్యారు.

ఒక బ్రహ్మాండమైన భవంతి యొక్క వైభవం చేయలేని అద్భుతాన్ని, డాక్టర్జీ యొక్క నిస్వార్థమైన ప్రేమ సాధించింది. సంఘానికి పునాది ఇటుకలు, రాళ్లతో కట్టిన గొప్ప భవనాలు లేదా కూడబెట్టిన అపారమైన సంపద కాదని, కేవలం కార్యకర్తల హృదయాల మధ్య ఉన్న పవిత్రమైన అనుబంధమేనని అక్కడి వారందరూ సంపూర్ణంగా అర్థం చేసుకున్నారు. ఒక సంస్థలో ఎవరూ చిన్నవారు లేదా పెద్దవారు, ధనవంతులు లేదా పేదవారు కారు. సామరస్యం మరియు సమానత్వంతో ప్రతి ఒక్కరి పట్ల నిష్కల్మషమైన ఆప్యాయతను చూపించేవాడే నిజమైన కార్యకర్త అని ఈ ఘట్టం చాటిచెబుతోంది.

మనిషి హోదా లేదా సామాజిక స్థాయి ఎంత ఉన్నతమైనదైనా, జీవితంలో ఎల్లప్పుడూ నిరాడంబరతను మరియు వాస్తవిక మానవ సంబంధాలను మరువకూడదు. నిజమైన నాయకత్వం అనేది కేవలం వేదికలెక్కి ఇచ్చే ఆకర్షణీయమైన ప్రసంగాల నుండి పుట్టదు, తోటి కార్యకర్తల సుఖదుఃఖాలను నిజమైన ఆప్యాయతతో పంచుకోవడం ద్వారా దానంతట అదే వికసిస్తుందని సామాజిక విశ్లేషకులు సైతం ఈ సంఘటనను ఉటంకిస్తూ విశ్లేషిస్తుంటారు. "నేను నా తోటి స్వయం సేవకులను, సమాజంలోని ప్రతి వ్యక్తిని ఎలాంటి వివక్షత లేకుండా, కులమతాలకు అతీతంగా నిజమైన ఆప్యాయతతో చూస్తాను" అనే దృఢ నిశ్చయం ప్రతీ కార్యకర్త గుండెలో నిరంతరం రగులుతూ ఉండాలని డాక్టర్జీ జీవితంలోని ఈ అద్భుత ఘట్టం మనకు సదా బోధిస్తుంది.వ్యక్తుల హృదయాలను ఒక తాటిపైకి తెచ్చి, అస్ఖలితమైన జాతీయవాదమే శ్వాసగా అడుగులేసిన 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్' ఇటీవలే తన శతాబ్ది (100 సంవత్సరాలు) ఉత్సవాలను అత్యంత వైభవంగా పూర్తి చేసుకుంది. జాతి నిర్మాణంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న ఈ మహత్తర సంస్థ 100 సంవత్సరాలు కాదు, రాబోయే 1000 సంవత్సరాలైనా సరే తన ఆదర్శాలతో, నిరాడంబర సేవాభావంతో ఈ దేశ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇది కేవలం ఒక సంస్థ ప్రస్థానం కాదు... అఖండ భారతమాత చరణాలపై కోట్లాది స్వయంసేవకులు సమర్పిస్తున్న ఒక నిరంతర ఆత్మీయ నీరాజనం!

**గడల నరసింహారావు.**
**అసోసియేట్ ఎడిటర్, మహాపత్రిక.**






# నస్పూర్ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

- **నలుగురు మహిళా కార్మికులు మృతి**

**మందమర్రి/మంచిర్యాల, మహా** : నస్పూర్ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళా కార్మికులు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటనతో మందమర్రి మండలం పొన్నారం, గుడిపల్లి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మందమర్రి మండలానికి చెందిన 8 మంది మహిళలు మంచిర్యాలలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్నారు. రోజులాగే ఉదయం ఆటోలో విధులకు బయలుదేరారు. నస్పూర్ గేట్ సమీపానికి రాగానే ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చింతకుంట్ల లక్ష్మి (30), సౌందర్య (25) అక్కడికక్కడే మృతి చెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రవళి, సోనియా మృతి చెందారు. మరో ముగ్గురు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలాన్ని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ భాస్కర్ పరిశీలించారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను అన్ని విధాలా ఆదుకుంటామని




ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంత్రి గడ్డం వివేకానంద హామీ ఇచ్చారు. అందులో భాగంగా మృతి చెందిన కుటుంబాలకు తక్షణ సహాయంగా తలో 25 వేల రూపాయలు, గాయపడ్డ వారికి పదివేల రూపాయల చొప్పున అందజేశారు.

# పార్మాసిటీని రద్దు చేయాలి

- **మా భూములు మాకు ఇవ్వాలి: రైతులు**
- **ఇబ్రహీంపట్నంలో ప్రజాభవన్ ముట్టడించిన ఫార్మా రైతులు..**
- **ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్.!**



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 28 మహా**: ర్మసిటిని రద్దుచేసి మా భూములను మాకు ఇవ్వాలని రైతుల డిమాండ్ చేశారు. యాచారం ప్రాంతంలో ప్రతిపాదించిన ఫార్మాసిటీని రద్దు చేసి, ప్రభుత్వం సేకరించిన తమ భూములను తిరిగి తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ యాచారం మండలానికి చెందిన ఫార్మా రైతులు సోమవారం ప్రజాభవన్‌ను ముట్టడించారు. తమ భూముల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని రైతులు స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఫార్మాసిటీ కోసం తీసుకున్న భూములకు సంబంధించిన నిర్ణయాన్ని పునః పరిశీలించి, ఫార్మాసిటీ ప్రతిపాదనను రద్దు చేయడంతో పాటు తమ భూములను తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**జీవో నంబర్ 31 అమలు చేయాలి..**

ఫార్మాసిటీకి సంబంధించి గతంలో ఇచ్చిన భూములపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లకు అనుగుణంగా జీవో నంబర్ 31ను అమలు చేసి, భూములను రైతులకు తిరిగి ఇచ్చే ప్రక్రియను ప్రారంభించాలని కోరారు..

**మూడేళ్లు గడిచినా పట్టించుకోలేదని ఆవేదన..**

ఎన్నికల సమయంలో తమ భూముల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మంత్రులు సీతక్క, బట్టి విక్రమార్క, రాజు గోపాల్ గౌడ్, కోదండ రెడ్డి, తీన్మార్ మల్లన్నలు, మా వద్దకు వచ్చి తిరిగి భూములు ఇస్తానన్ని హామీ ఇచ్చారు. మూడేళ్లు గడుస్తున్నా తమ సమస్యపై తగిన స్థాయిలో స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పష్టమైన పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. తమ భూముల కోసం ఎన్నో రోజులుగా పోరాటం చేస్తున్నామని, ఇకపై కూడా న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు. తమ జీవనాధారమైన భూములను తిరిగి ఇవ్వడం ద్వారా ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

**ప్రజాభవన్ వద్ద ఉద్రిక్తత...**

రైతులు పెద్ద సంఖ్యలో ప్రజాభవన్ వద్దకు చేరుకుని తమ డిమాండ్లను వినిపించడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఫార్మాసిటీ నిర్ణయంపై స్పష్టత ఇవ్వాలని రైతులు నినాదాలు చేశారు. రైతుల సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులతో చర్చలు జరిపి పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు.



## శంషాబాద్ లో విషాదం

**ప్రియుడి మరణం తట్టుకోలేక యువతి బలవన్మరణం**

**రాజేంద్రనగర్ మహా** : గ్రేటర్ శంషాబాద్ పరిధిలోని సిద్దేశ్వర్ కాలనీలో 19 ఏళ్ల బురా నర్మద అనే యువతి ఆత్మహత్యకు పాల్పడింది. యువతి మరణం పై బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, మృతురాలు అక్క నివాసంలోని పడకగదిలో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. స్థానికులు ఆమెను కిందకు దించేసరికి, అప్పటికే మరణించింది. సంఘటనా స్థలంలో చేతితో రాసిన ఒక లేఖ లభ్యమయింది. ఆ లేఖ, ఫిర్యాదుదారుని వాంగ్మూలం ప్రకారం, మృతురాలు నర్మద, సిద్ధార్థ్ బెజానీ గౌడ్‌ను ప్రేమించింది, అతను సుమారు 15 రోజుల క్రితం ఒక రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆమె తన ప్రియుడి మరణాన్ని జీర్ణించుకోలేక తీవ్రమైన మానసిక క్షోభకు గురై ఆత్మహత్యకు పాల్పడింది. ఆర్జిఐఏ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సంబంధిత ఆధారాలను సేకరించి, సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తు ఆధారంగా చట్ట ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



# గుర్రం జాషువా సాహిత్యం పై ఎక్కుపెట్టిన అస్త్రం

- **స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో 131వ జయంతి సంస్మరణ సభ**

**కుషాయిగూడ, మహా** : ప్రముఖ కవి, నవయుగ వైతాళికుడు గుర్రం జాషువా 131వ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం కమలానగర్‌లోని సీఐటీయూ కార్యాలయ ప్రాంగణంలో సంస్మరణ సభ నిర్వహించారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సామాజిక ఉద్యమ నేత జయరాజ్, మహిళా ఉద్యమ నాయకురాలు శారద జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ, ఎన్నో కుల, సామాజిక వివక్షలను ఎదుర్కొంటూనే ఆనాటి పండితులను తన సాహిత్య ప్రతిభతో ఎదిరించిన మహాకవి గుర్రం జాషువా అని కొనియాడారు. సంస్కృతం, తెలుగు భాషల్లో పద్య, వచన కవిత్వంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. తన ప్రతిభతో పండితుల ప్రశంసలు అందుకుని గండపెండేరం ధరించే స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. సామాజిక ఉద్యమ నేత జయరాజ్ మాట్లాడుతూ.. మాదిగ కుటుంబానికి చెందిన తల్లి, యాదవ కుటుంబానికి చెందిన తండ్రి ద్వారా జన్మించిన జాషువా ఆనాటి సమాజంలో తీవ్ర కులవివక్షను ఎదుర్కొన్నారని తెలిపారు. ఆ వివక్షకు తన సాహిత్యాన్నే సమాధానంగా మలుచుకుని, పట్టుదలతో సాహిత్య రంగంలో నిష్ణాతుడిగా ఎదిగారని చెప్పారు. ఆయన రచించిన "గబ్బిలం"లో సామాజిక వివక్షను, అణగారిన వర్గాల ఆవేదనను శివుడికి మొరపెట్టుకునే రూపంలో అద్భుతంగా ఆవిష్కరించారని వివరించారు. విజ్ఞానవేత్త వెంకటాచలం మాట్లాడుతూ.. కాళిదాసు రచించిన "మేఘసందేశం"కు భిన్నంగా జాషువా గబ్బిలం కావ్యాన్ని రూపొందించారని పేర్కొన్నారు. మేఘసందేశంలో మేఘాన్ని సందేశ వాహకంగా ఉపయోగిస్తే, గబ్బిలంలో వివక్షకు గురైన జీవిని సందేశ వాహకంగా ఎంచుకుని అణగారిన వర్గాల ఆవేదనను శివుడికి చేరవేసే విధానాన్ని జాషువా అద్భుతంగా వ్యక్తీకరించారని తెలిపారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. గబ్బిలం, ఫిరదౌసి, క్రీస్తు చరిత్ర వంటి గొప్ప రచనలతో జాషువా తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించారని చెప్పారు. ఆయన సాహిత్య ప్రతిభను గుర్తించిన భారత ప్రభుత్వం పురస్కారాలతో సత్కరించిందని తెలిపారు. విశ్వనాథ సత్యనారాయణ వంటి ప్రముఖ పండితులతోనూ తన చతురతతో, సాహిత్య ప్రతిభతో సమాధానమిచ్చిన తీరు కవిలోకానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం ఎం. భాస్కర్‌రావు గుర్రం జాషువా జీవిత విశేషాలను వివరించారు. శారద, జి. శివరామకృష్ణ తదితరులు ప్రసంగిస్తూ జాషువా సాహిత్య గొప్పతనాన్ని, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. అనంతరం సభకు హాజరైన సభ్యులంతా జాషువా చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, శోభ, గౌసియా, శారద, వెంకటేశ్వరరావు, వెంకటాచలం, భాస్కర్‌రావు, జయరాజ్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ మండల కమిటీలో పదవుల భర్తీ

- **ఉపాధ్యక్షుడిగా పానెం ఈశ్వర్ నియామకం**

**సత్తుపల్లి, సెప్టెంబరు 28:మహా** : కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి మండల కమిటీలో పలు పదవుల భర్తీలో భాగంగా కిష్టారం గ్రామానికి చెందిన పానెం ఈశ్వర్‌ను మండల ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి సోమవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పానెం ఈశ్వర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తానన్నారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పని చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి: కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి ప్రజల నుంచి వినతులు ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపేందుకు ప్రజావాణి కార్యక్రమం కీలక వేదికగా పనిచేస్తుందన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని క్లిష్టమైన సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజావాణి దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలోని ఎంపీడీఓ కార్యాలయాల్లో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీఓ కార్యాలయాల్లోనే వినతులు సమర్పించి స్థానిక స్థాయిలో సమస్యల పరిష్కారం పొందవచ్చన్నారు. వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పించడం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



# భగత్‌సింగ్ స్ఫూర్తితో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు అండగా నిలవాలి

- **పాలస్తీనా, క్యూబా, ఇరాన్ ప్రజలకు సంఘీభావం ప్రకటించాలి**
- **సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్ మధుసూదన్‌రెడ్డి..**

**మణుగూరు, మహా** : స్వేచ్ఛ, సార్వభౌమత్వం కోసం పాలస్తీనా, క్యూబా, ఇరాన్ ప్రజలు సాగిస్తున్న పోరాటాలకు భగత్‌సింగ్ స్ఫూర్తితో భారత ప్రజలు సంఘీభావంగా నిలవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మణుగూరులో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలనను సవాలు చేస్తూ భగత్‌సింగ్ సాగించిన విప్లవ పోరాటం భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. పాలస్తీనా, క్యూబా, ఇరాన్‌లలో ఆధిపత్యం, ఆక్రమణ, బలవంతపు ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న ప్రజలకు సంఘీభావం ప్రకటించడం ద్వారా అంతర్జాతీయవాద స్ఫూర్తిని కొనసాగించవచ్చని ఆయన పేర్కొన్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమే భగత్‌సింగ్ అందించిన ప్రధాన సందేశాల్లో ఒకటని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమెరికా ఒత్తిడికి తలొగ్గుతూ అనుసరిస్తున్న విదేశాంగ, వాణిజ్య విధానాలు దేశ వ్యవసాయ రంగం, సామాన్య ప్రజల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ఉన్నాయని మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో ఆంక్షలకు తలొగ్గితే ఇంధన వ్యయం పెరిగి ప్రజలపై అదనపు భారం పడే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. అదానీకి సంబంధించిన వ్యవహారాలు, అమెరికా ఆంక్షల విషయంలోనూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆయన విమర్శించారు. ఇరాన్‌పై జరిగిన దాడులను, పాలస్తీనాలో జరుగుతున్న పరిణామాలను భారత ప్రభుత్వం మరింత స్పష్టంగా ఖండించాలని ఆయన డిమాండ్ చేశారు. భారతదేశం నుంచి పాలస్తీనా, క్యూబా వరకు స్వేచ్ఛ, సార్వభౌమత్వం కోసం జరిగే ప్రజా పోరాటాలకు మద్దతుగా నిలవడమే భగత్‌సింగ్ స్ఫూర్తిని కొనసాగించడమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి. సంజీవరెడ్డి, ఆర్. ప్రసాద్, చంద్రశేఖర్, యోహాన, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ వేడుకలు విజయవంతం

- **ఉద్యమకారులకు ధన్యవాదాలు తెలిపిన టియుఏఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య**

**యాదాద్రి భువనగిరి సెప్టెంబర్ :** 28 మహా న్యూస్ : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆవిర్భావ దినోత్సవం యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్స వేడుకలను విజయవంతం చేసిన ప్రతి తెలంగాణ ఉద్యమకారునికి ధన్యవాదాలు తెలుపుతున్నామని టియు ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులను గుర్తించాలని ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని గత తొమ్మిది సంవత్సరాల క్రితం డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఫోరం ఏర్పడిందని నేటికీ 9 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్నందున ఉద్యమ వందనాలు తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల పట్ల సానుకూలంగా ఉన్నందున ప్రతి ఉద్యమకారుడు అభినందించాలని ఆయన అన్నారు. తదుపరి కార్యచరణ పై త్వరలో రాష్ట్ర కమిటీ సమావేశమవుతుందని ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య అన్నారు.



# మండలంలో 84 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులు

- **శంఖుస్థాపన లు ,ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే జారె.**

**దమ్మపేట, మహా:** దమ్మపేట మండలంలో రూ.84 లక్షల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సోమవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. జగారం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనం, రూ.10 లక్షలతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేశారు. రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. కొడిసెలగూడెంలో రూ.12 లక్షల అంగన్‌వాడీ భవనం, తాటిసుబ్బన్నగూడెంలో రూ.10 లక్షల మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. పట్వారిగూడెంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మొండివర్రెలో 'హలో సుభోదయం' కార్యక్రమంలో ప్రజలను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మందలపల్లి TGSTWRSలో అశ్వారావుపేట జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధితో పాటు విద్య, క్రీడలు, మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు.



# జీతాలు ఇప్పించండి

- **కార్మికులు పనిచేసిన వేతనాలను అడుక్కోవాలా?**
- **సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ హెచ్చరిక**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** గత ఆరు నెలల నుండి స్వచ్ఛమిత్ర కార్మికులకు జీతాలు ఇవ్వకుండా వారి జీవితాలతో ఆటలాడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే దృష్టి పెట్టి వారి పొట్ట కొట్టకుండా ఆరు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారినీకి స్వచ్ఛ మిత్ర కార్మికుల సంఘం సీఐటీయూ తరఫున వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా భూక్యా రమేష్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్వచ్ఛమిత్ర కార్మికులు లేకుంటే పనులు ఎక్కడికక్కడే ఆగిపోయే పరిస్థితి ఉందన్నారు. ఒకవైపు కుటుంబాన్ని పోషించుకుంటూ చాలీచాలని వేతనంతో పాఠశాలలో కూడా విద్యార్థులకు సేవ చేస్తూ ఆధ్యాపకుల కూడా సేవ చేస్తూ ఉన్నప్పటికీ కార్మికుల శ్రమను గుర్తించకుండా ఆరు నెలల పాటు జీతాలు పెండింగ్‌లో ఉంచడం ఎంతవరకు సమంజసం అని ఆయన అన్నారు. ప్రభుత్వ విద్యా శాఖలో పనిచేస్తున్న టీచర్లకు పర్మనెంట్ వర్కర్లకు ఒక్క నెల జీతం రాకుండా ఉంటే ప్రభుత్వాన్నే స్తంభింపజేసే పరిస్థితి ఉంటుందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్వచ్ఛమిత్ర వర్కర్లకు ఆరు నెలల నుండి జీతాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వం సంబంధిత అధికారులు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రతి ఇంట్లో పండగ సందర్భంగా సంతోషంగా ఉండాల్సిన సమయంలో జీతాలు రాక పెరిగిన ధరలను తట్టుకొని కనీసం మూడు పూటలు తిండి కడుపునిండా తినే పరిస్థితి కూడా లేని సమయంలో పండగ నాడు కూడా పస్తులు ఉండేలా ప్రభుత్వం సంబంధిత అధికారులు చేస్తున్న తీరుపై ఆయన విమర్శించారు. ఇప్పటికైనా ఆరు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని లేదంటే సమ్మె చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సత్య మిత్ర కార్మిక సంఘం నాయకులు నిహారిక, రూతు, సాధన, వెంకట నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.




## మండల స్థాయి ప్రజావాణికి స్పందన!

**పెద్దపల్లి మహా,** కాల్వ శ్రీరాంపూర్: మండల కేంద్రంలోని సోమవారం రోజున జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు అధికారులకు దరఖాస్తులు అందజేశారు. సంబంధిత సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్ కుమార్, మండల రెవెన్యూ ఆర్ఐ వినోద్, విద్యుత్ శాఖ అధికారులు మరియు సంబంధించిన ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS | మంగళవారం, హైదరాబాద్ | 29-09-2026




# సర్ ప్రక్రియతో దేశంలో 13 కోట్ల ఓట్లను తొలగించారు

- బిజెపితో కలిసి పోయి ఓట్ల చోరీకి పాల్పడుతున్నారు.
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలి.
- సిపిఐ జాతీయ సభ్యులు పాలమాకుల జంగయ్య

**రాజేంద్రనగర్ మహా ;** ప్రధాన ఎలక్షన్ కమిషన్ ఈసీఐలో ముగ్గురు సభ్యులు కలిగిన కమిటీలో ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ బిజెపి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడు. ఓట్ల చోరీకి అవకాశం కల్పించిన జ్ఞానేశ్ కుమారు తక్షణమే తొలగించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. గ్రేటర్ శంషాబాద్ పరిధిలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర సభ్యులు పానుగంటి పర్వతాలు పర్యవేక్షణలో అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసన కార్యక్రమానికి ముఖ్యాతిథిగా సిపిఐ జాతీయ సభ్యులు జంగయ్య పాల్గొన్నారు. అయిన మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఓట్లను తొలగించే కార్యక్రమాన్ని కి పాల్పడే అవకాశం కల్పించిన ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ స్వచ్ఛందంగా రాజీనామా చేయకపోతే పార్లమెంటులో చర్చించి సస్పెండ్ చేయాలని జంగయ్య డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓట్ల చోరీకి పాల్పడానికి అధికారులను అడ్డం పెట్టుకొని ప్రతిపక్ష నాయకుల ఎన్నికల దరఖాస్తులను తిరస్కరించే కుట్రలు చేస్తూ ఇతర పార్టీల ఎమ్మెల్యే ఎంపీలను ప్రలోభ పెట్టి బిజెపిలోకి చేరే విధంగా ఈ డి, సి బి ఐ ఎన్నికల అధికారులను వాడుతున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయలేని అసమర్థ బిజెపి ప్రభుత్వం ప్రజాక్షేత్రంలో వ్యతిరేకతను పోగొట్టడానికి మతాన్ని ఒక ఆయుధంగా మలుచుకొని రాజకీయాలు చేయడం సిగ్గుమాలిన చర్యని ఆయన దుయ్యబట్టారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించే ప్రధాన ఎన్నికల అధికారులు ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ఓట్లను తొలగించే కుట్ర చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అలాంటి వ్యక్తులను తక్షణమే పదవుల నుంచి తొలగించాలన్నారు.ఇలాంటి వ్యక్తులు పదవిలో ఉంటే ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుందన్నారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు సిపిఐ పార్టీ ఆందోళనలు పోరాటాలు చేస్తుందని ఆయన హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, సిపిఐ కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు, సిపిఐ సభ్యులు రామస్వామి, యాదిరెడ్డి, రామకృష్ణ, కామెడీ శేఖర్ రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, యాదయ్య, ఆర్ యాదగిరి, నీలమ్మ, శివకుమార్,ఎం ఏ రియాజ్, దత్తు నాయక్, కే చందు యాదవ్, మల్లేష్, శ్రీశైలం, శ్రీనివాస్, ఆనంద్ గౌడ్, విజయ్ , గిలక రాజు, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయాలి

- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయడంతో పాటు విద్యాలయాల్లో శుభ్రత పాటించాలని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) ను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన ఉపాధ్యాయుల హాజరు విద్యా ప్రమాణాలు పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు మందుల నిల్వలు సిబ్బంది హాజరు ల్యాబొరేటరీ సేవలను పరిశీలించారు. ముందుగా చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పాఠశాల ఆవరణను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేసి విధులకు హాజరైన సెలవులో ఉన్న ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికలో నమోదైన వివరాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఆయా తరగతి గదుల్లో అందుబాటులో ఉన్నారా లేదా అనే అంశాన్ని స్వయంగా పరిశీలించారు. వివిధ తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై వారి అవగాహనను తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న బోధన వారి అభ్యసన స్థాయిని పరిశీలించారు. పదో తరగతి గదిలో ఉపాధ్యాయుడు అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ ఆరా తీశారు. ఇందుకు సరైన సమాధానం లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఉపాధ్యాయులు నిరంతరం పాఠ్యాంశాలను బోధించాలని తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గత విద్యా ఫలితాలు ప్రస్తుత విద్యా ప్రగతికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వెనుకబడిన విద్యార్థులపై అదనపు దృష్టి సారించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

**ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్..**

పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ వైద్యాధికారితో మాట్లాడి కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు రోజువారీగా వచ్చే ఓపీ రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సుమారు 50 నుంచి 60 మంది వరకు ఓపీకి వస్తున్నట్లు అధికారులు తెలిపారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్య సేవలు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఆరోగ్య కేంద్రంలోని ఇన్‌పేషెంట్ విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్ చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి అందుతున్న వైద్య సేవలు మందుల పంపిణీ తదితర వివరాలను తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సేవలను అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ మందుల నిల్వలను తనిఖీ చేశారు. అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మందులను నిబంధనల ప్రకారం సక్రమంగా నిల్వ చేయాలని, మందుల గడువు తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. గడువు ముగిసిన మందులను గుర్తించి నిబంధనల ప్రకారం వెంటనే తొలగించాలని ఆదేశించారు. అవసరమైన మందులు వైద్య పరికరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా ముందస్తుగా ఇండెంట్ పెట్టి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది హాజరు పట్టికను కూడా కలెక్టర్ పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకుని ప్రతి ఒక్కరూ విధులకు సక్రమంగా హాజరవుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ల్యాబొరేటరీని పరిశీలించిన కలెక్టర్ ల్యాబ్ టెక్నీషియన్‌తో మాట్లాడి రోగులకు నిర్వహిస్తున్న రక్త పరీక్షలు డెంగ్యూ మలేరియా నిర్ధారణ పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మలేరియా నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉన్నాయని డెంగ్యూ నిర్ధారణ కిట్ల కోసం ఇప్పటికే ఇండెంట్ పెట్టినట్లు సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అవసరమైన పరీక్షా కిట్లు మందులు ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలు ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతపై సంబంధిత అధికారులు సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ అంకిత్ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందేలా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ నాగరాజు, ఎంఈఓ నీరజ, పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి, నర్సులు సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## చదువుకు వయస్సుతో పనిలేదు

- పాలకుర్తి గ్రామంలో నైట్ బడి మహిళలకు ఉల్లాస్ పరీక్షలు

**పాలకుర్తి 28 మహా** సెప్టెంబర్ పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం పాలకుర్తి ఉల్లాస్ పరీక్షలు ఉత్సాహభరితంగా నిర్వహించబడ్డాయి. గ్రామీణ మహిళల్లో అక్షరాస్యతను పెంపొందించేందుకు, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నైట్ బడి రాత్రి పాఠశాల ద్వారా శిక్షణ పొందిన మహిళా సంఘాల సభ్యులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. పగటిపూట నిత్య జీవిత పనుల్లో బిజీగా ఉండే మహిళలు, రాత్రి వేళల్లో శ్రమించి నేర్చుకున్న చదువును ఈ పరీక్షల ద్వారా ప్రదర్శించారు. ఈ ఉల్లాస్ పరీక్షల పరిశీలన కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల మాట్లాడుతూ.. వయస్సుతో సంబంధం లేకుండా మహిళలు చదువుకోవాలనే పట్టుదలతో నైట్ బడికి వచ్చి, అక్షరాస్యత వైపు అడుగులు వేయడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. చదువుతోనే మహిళల సాధికారత సాధ్యమవుతుందని, ప్రతి మహిళా అక్షరాస్యురాలు కావాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ ఉల్లాస్ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో మంచి మార్పు తీసుకువస్తోందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివోఏ, వివోఓ,మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పరీక్షలు రాస్తున్న మహిళలకు ప్రోత్సాహాన్ని అందించారు. నైట్ బడి ద్వారా తమకు చదవడం, రాయడం రావడంపై మహిళలు హర్షం వ్యక్తం చేశారు.



# యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా మల్లెత్తుల శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక

- యూత్ మండల అధ్యక్షుడిగా అట్ల శ్రీనివాస్ ఎంపిక

**బసంత్‌నగర్:** బసంత్‌నగర్ కోదండ రామాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన యాదవ మహాసభలో యాదవ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సమావేశానికి జిల్లా యాదవ సంఘం నాయకులతో పాటు మండలంలోని 16 గ్రామాలకు చెందిన యాదవ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మండలానికి చెందిన కొత్తపల్లె మాజీ సర్పంచ్ మల్లెత్తుల శ్రీనివాస్ను యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే బసంత్‌నగర్‌కు చెందిన అట్ల శ్రీనివాస్ను యాదవ సంఘం యూత్ మండల అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. అట్ల శ్రీనివాస్ యూత్ నాయకుడిగా ఈ ప్రాంతంలో సుపరిచితుడిగా ఉన్నారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా, మండల యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ యాదవ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, యువత సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సంఘ సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు .ఈ కార్యక్రమంలో బసంత్‌నగర్ సర్పంచ్ పరిషవేణి శ్రీనివాస్ యాదవ్తో పాటు పలువురు యాదవ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు.



## విద్యార్థులు ఆకలితో అలమటించవద్దు: ప్రభుత్వ విప్

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హరే రామ హరే కృష్ణా ట్రస్టు భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం పొందుతున్న పేద విద్యార్థులు ఆకలితో అలమటించవద్దు అనే సంకల్పంతో ఏర్పాటు చేసిన తెలంగాణ అల్పాహార కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ ప్రారంభించారు. విద్యార్థులు ఆకలితో అలమటించకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న విద్య, మౌలిక వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన విప్,ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని విజయ రమణారావు పేర్కొన్నారు.

# రైతుల సంక్షేమమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యం

**మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**



**వేములవాడ, మహా:** శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో నూతనంగా ఏర్పడిన ప్యాక్స్ పాలకవర్గం సోమవారం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమం ఆర్థిక అభివృద్ధి కోసం దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా రైతులకు 2 లక్షల రూపాయలు రుణమాఫీ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిది అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రైతులు బాగుంటేనే గ్రామాలు,పట్టణాలు అభివృద్ధి చెందుతాయనే ముఖ్య ఉద్దేశంతో సహకార సంఘాలు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన సమయంలో సహకారం అందించడంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఎంతో ముఖ్యమైనవని రైతులకు రుణాలు,ఎరువులు, విత్తనాలు తదితర అవసరాలను సకాలంలో అందిస్తూ వారికి అండగా సహకార సంఘాలు నిలవాలి అని రైతుల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సహాయ కార్యక్రమాలు అర్హులైన ప్రతి రైతుకు చేరేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మన సహకార సంఘం పరిధిలోని 22 గ్రామాల లో ఉన్న రైతులకు ఏ సమస్య వచ్చినా వారి పక్షాన పాలకవర్గ సభ్యుల నిలబడి,సాధ్యమైనంత వరకు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలి అని సహకార సంఘం సభ్యులకు,రైతులకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తానని పుల్కం రాజు అన్నారు. సహకార సంఘం సభ్యులందరూ ఐక్యంగా పనిచేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని,తద్వారా రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకరావచ్చు అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు,ఆత్మ కమిటీ చైర్మన్,ముస్కు ముకుందర్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్,కౌన్సిలర్ కొండ రాజశేఖర్,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కరుణాకర్,PACS కార్యదర్శి,అధికారులు,రైతు సంఘాల సభ్యులు,పెద్ద ఎత్తున రైతులు తదితరులు పాల్గొన్నారు.



## యువత రాజకీయాల్లోకి రావాలి!

**ప్రజాసేవలో యువత కీలక పాత్ర పోషించాలి: దాసరి ఉష**

**పెద్దపల్లి మహా :** యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవలో కీలక పాత్ర పోషించాలని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష పిలుపునిచ్చారు. పెద్దపల్లి శాంతినగర్‌లో మైనార్టీ యువతతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక సేవతో పాటు ప్రజలతో మమేకమై పనిచేయాల్సిన బాధ్యతలపై యువతకు అవగాహన కల్పించారు. యువతలోని శక్తి, ఉత్సాహాన్ని ప్రజా సంక్షేమానికి వినియోగిస్తూ ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కోఆర్డినేటర్ అబ్దుల్ మాలిక్, అబ్దుల్ ఆదిల్, ఎండీ ముఖిత్, అఫ్జల్ పాషా, ఎండీ తాజ్, అబ్దుల్ ముజీబ్తో పాటు పెద్దపల్లి వివిధ వార్డులకు చెందిన యువత పాల్గొన్నారు.



# బెల్లంపల్లి లో ఘనంగా భగత్ సింగ్ జయంతి వేడుకలు

**బెల్లంపల్లి,మహా:** దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలకుల చేతిలో అమరుడైన భగత్ సింగ్ జయంతి వేడుకలను బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి గని కార్మిక సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ చేసిన త్యాగం, చూపిన ధైర్యం, దేశభక్తి నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.భగత్ సింగ్ చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసి యువతలో జాతీయ స్ఫూర్తిని నింపారని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు సింగరేణి కారలిస్ లేబర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణిరామ్ సింగ్, సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్, శ్రామిక శక్తి గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం పోషమల్లు ,రాష్ట్ర కార్యదర్శి గజ్జె దుర్గయ్య , టిడిపి బెల్లంపల్లి పట్టణ ఉపాధ్యక్షులు తైదల మధునయ్య, ఏఐఎఫ్ టి యు జిల్లా నాయకులురేగుంట రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చట్ట పరిధిలో సమస్యలు పరిష్కరించుకోండి!

**పెద్దపల్లి మహా :** ప్రజలు, బాధితులు తమ సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించుకునేందుకు పోలీసులను ఆశ్రయించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఆయన బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడిన కమిషనర్, చట్టపరమైన నిబంధనల మేరకు సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూములకు హద్దులు ఏర్పాటు చేయాలి

- ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హనుమకొండ, మహా ;** ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. కాజీపేట మండలం మడికొండ గ్రామంలో క్రైస్తవ, ముస్లిం మతస్తులకు స్మశాన వాటికల కేటాయింపునకు ప్రతిపాదించిన స్థలాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. స్థలానికి సంబంధించిన వివరాలు, భూమి విస్తీర్ణం, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి తదితర అంశాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్మశాన వాటిక కేటాయింపునకు సంబంధించి అవసరమైన స్థల పరిశీలన, రికార్డుల పరిశీలన పూర్తి చేసి, అవసరమైన ప్రతిపాదనలను నిబంధనల ప్రకారం సమర్పించాలని ఆర్డీఓ వెంకటేష్, కాజీపేట తహసీల్దార్ రాజును జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా వాటి పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన ఖాళీ ప్రదేశాలను గుర్తించి, వాటి చుట్టూ స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల వివరాలను రికార్డులతో క్షేత్రస్థాయిలో సరిపోల్చి పరిశీలించాలని, ప్రభుత్వ భూములపై అనధికార ఆక్రమణలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు అవసరమైన చర్యలను ప్రాధాన్యతతో చేపట్టాలని తెలిపారు. ప్రజా అవసరాల కోసం ప్రభుత్వ భూములను కేటాయించే సందర్భంలో భూమి స్థితిగతులు, రికార్డులు, స్థల అనుకూలత తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలను త్వరితగతిన సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, కాజీపేట తహసీల్దార్ రాజు, రెవెన్యూ అధికారులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర ఎన్నికల కమిషన్ తీరుపై కాంగ్రెస్ నిరసన

**దిష్టిబొమ్మ దహ**
**రాజీనామాకు డిమాండ్**

**పెద్దపల్లి మహా :** కేంద్ర ఎన్నికల కమిషన్ తీరును నిరసిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఓట్ల తొలగింపులో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ నాయకులు ఆందోళన చేపట్టారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావుతో పాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

**వరంగల్, కలెక్టరేట్ మహా** : రాష్ట్రంలోని పాఠశాల విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను పటిష్టంగా పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుడి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యతో పాటు మౌలిక వసతులపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.రెసిడెన్షియల్ విద్యాసంస్థలను క్రమం తప్పకుండా ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నప్పటికీ కొన్ని చోట్ల ఫుడ్ పాయిజనింగ్, ఎలుకలు, పాముకాటు వంటి ఘటనలు చోటు చేసుకోవడం పై ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని సీఎస్ ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఆహారం తయారీ, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని సీఎస్ తెలిపారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, పారిశుధ్య నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల లోపాలు తదితర అంశాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సాధ్యమైన చోట్ల వంటశాలల ఆధునీకరణ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఉన్నతస్థాయిలో పర్యవేక్షించేందుకు రూపొందించిన డ్యాష్‌బోర్డ్ ను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించాలని సంజయ్ జాజు తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా లేదా, ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను పరిశీలించి, వాటి వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన దుప్పట్లను ముందుగానే సమకూర్చాలని సీఎస్ ఆదేశించారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థల భవన యజమానులతో కలెక్టర్లు సమావేశమై అవసరమైన మార్పులు, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడికి అవసరమైన శిక్షణ అందేలా చర్యలు చేపట్టాలని సీఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతిరోజూ ఒక లక్ష యూనిఫారాలు కుట్టేలా చర్యలు చేపట్టాలని, దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ, వైవి గణేష్, జిల్లా బి సి వెల్ఫేర్ అధికారి పుష్పలత, డి టి డి వో నారాయణరెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి రంగయ్య నాయుడు, సంబధిత ఆర్సీవోలు, తదితరులు పాల్గొన్నారు




# ఆటో అడ్డా పేరుతో అరాచకం

- నడిరోడ్డు పైనే ఆటోలు పార్కింగ్
- పోచమ్మ మైదాన్ లో తరచు ట్రాఫిక్ జామ్
- రోడ్లను సగం ఆక్రమిస్తున్న చిరు వ్యాపారులు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

**వరంగల్, బ్యూరో మహా**: వరంగల్ నగరంలో తరుచూ వాహనాల తనిఖీలు, డీ.డీలు, ఛలాన్లు కట్టించడం లేదా విధించడం పై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రించడంలో ట్రాఫిక్ పోలీసులకు ఏమాత్రం లేదని వరంగల్ నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని ఎంజీఎం, పోచమ్మ మైదాన్, పోస్ట్ ఆఫీస్, వరంగల్ బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, ములుగు రోడ్డు ప్రాంతాల్లో ఆటోల అడ్డా పేరుతో అరాచకం రోజురోజుకూ శృతి మించుతోంది. పోచమ్మ మైదాన్ ప్రధాన రహదారిపైనే ఆటోలను ఇష్టారాజ్యంగా పార్క్ చేస్తుండటంతో, నిత్యం ట్రాఫిక్ జామ్ తో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం పై ప్రజలు మండి పడుతున్నారు. వరంగల్ నగరానికి గుండెకాయ లాంటి పోచమ్మ మైదాన్ చౌరస్తాలో పరిస్థితి దారుణంగా తయారైంది. అధికారికంగా ఆటో స్టాండ్ ఉన్నా, ఆటో డ్రైవర్లు రోడ్డు మధ్యలోనే ఆటోలను అడ్డదిడ్డంగా పార్క్ చేస్తున్నారు. ప్రయాణికుల కోసం పోటాపోటీగా రోడ్డుపైనే ఆటోలు ఆపేస్తుండటంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూలు, కాలేజీ పిల్లలు, ఉద్యోగులు ట్రాఫిక్ జామ్ లో చిక్కుకుపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఒక్కోసారి అంబులెన్స్ లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. నడిరోడ్డు పై ఆటోల పార్కింగ్ తో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ముఖ్యంగా స్థానికులు, స్థానిక వ్యాపారస్తులు వ్యాపార సముదాయాల ముందు ఆటోలు నిలపడము డ్రైవర్ల స్థానికులతో దురుసుగా ప్రవర్తించడంతో రోజూ నరకం చూస్తున్నారు. ముఖ్యంగా పోచమ్మ మైదాన్ నుండి దేశాయ్ పేట రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేసిన నడిరోడ్డుపై ఆటోలు విచ్చలవిడిగా పార్కింగ్ చేసిన అటుగా వెళ్తున్న ట్రాఫిక్ పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఆటో యూనియన్ లతో కుమ్మక్కయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుని, నడిరోడ్డు పై ఆటోల పార్కింగ్ ను అరికట్టాలని, పోచమ్మ మైదాన్ ను ట్రాఫిక్ జామ్ నుంచి కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డును సగం ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వ్యాపారస్తులను అలాగే ఆటో అడ్డా పేరుతో జరుగుతున్న ఈ అరాచకానికి అడ్డుకట్ట వేసి, ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వరంగల్ నగరంలో ట్రాఫిక్ ను నియంత్రించడంలో ట్రాఫిక్ పోలీస్ అధికారి పర్యవేక్షణ లోపమే కారణమని ప్రజలు అంటున్నారు. సిబ్బంది పై ఆంక్షలు ట్రాఫిక్ పాయింట్ల లో సిబ్బంది ఉన్నారా లేరా అని ట్రాఫిక్ అధికారి స్థానికంగా ఉన్న వ్యాపారస్తులను అడిగి తెలుసుకోవడమే తప్ప ట్రాఫిక్ నియంత్రణ పై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలో ట్రాఫిక్ అధికారి తరచూ తనిఖీల పేరుతో డీడీలు, చలాన్లు విధించడం తప్ప ట్రాఫిక్ జామ్, సగం రోడ్లోని ఆక్రమించి వ్యాపారం చేస్తూ వాహనదారులు పాదచారుల కష్టాలను పట్టించుకోవడం లేదని, ఆటో అడ్డాల పై చర్యలు తీసుకోవడం లేదని, ప్రధానులను తీసుకోవలసిన చర్యలను పట్టించు కోవడంలేదని ముఖ్యంగా ప్రాంతాలను విభజించి సిబ్బందితో వివిధ రూపాల్లో వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వరంగల్ ట్రాఫిక్ పై దృష్టి సారించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# బతుకమ్మ, దసరా పండుగలకు పకడ్బందీ ఏర్పాట్లు

- సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలి
- బల్దియా కమిషనర్ టి. వెంకన్న




**వరంగల్, కార్పొరేషన్ మహా;** రాబోయే అక్టోబర్ 10వ తేదీ నుంచి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, గతంలో మాదిరిగానే నగరంలోని ఆయా ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ, దసరా పండుగల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ. వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం జీడబ్ల్యుఎంసి ప్రధాన కార్యాలయంలో బతుకమ్మ, దసరా పండుగల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిడబ్ల్యూఎంసి పరిధిలోని 66 డివిజన్లలో బతుకమ్మ వేడుకలు జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.బతుకమ్మ వేడుకలు నిర్వహించే ప్రదేశాల్లో రోడ్ల మరమ్మతులు, డస్టింగ్, విద్యుద్దీకరణ, గుర్రపు డెక్క తొలగింపు, పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సదుపాయం వంటి తదితర మౌలిక సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న బతుకమ్మ విగ్రహాలకు అవసరమైన చోట కొత్త రంగులతో ముస్తాబు చేసి, పరిసరాల పరిశుభ్రత, లైటింగ్ వంటి పనులను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.ఇటీవల నిర్వహించిన గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసిన తీరును కమిషనర్ అభినందించారు. అదే స్ఫూర్తితో బతుకమ్మ, దసరా పండుగలకు కూడా పకడ్బందీగా ఏర్పాట్లు చేసి విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. దసరా పండుగ రోజున ప్రజలు అధికంగా వచ్చే ఉర్సు గుట్ట, సిద్ధేశ్వర ఆలయం, రంగసాయిపేట తదితర ప్రాంతాల్లో గతంలో మాదిరిగానే ఇతర శాఖల అధికారుల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, తదితర అంశాల పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పండుగల సందర్భంగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన ఏర్పాట్లను ముందుగానే గుర్తించి పూర్తి చేయాలని, పండుగ రోజుల్లో కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కమిషనర్ వెంకన్న స్పష్టం చేశారు.పండుగలను పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణంలో ప్రజలు ఆనందంగా జరుపుకునేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా కమిషనర్ ఆదేశించారు.ఈ సమావేశం లో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్ కుమార్, సి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి డి ఎఫ్ ఓ శంకర్ లింగం, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, సి హెచ్. ఓ లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి తదితరులు పాల్గొన్నారు.



# అన్నదాన సేవ అభినందనీయం

**ఆదిలాబాద్ మహా :** పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు కష్టపడి చదివి, అందుబాటులో ఉన్న శిక్షణ, వసతులను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకాంక్షించారు. సోమవారం స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఉచిత అన్నప్రసాద సేవ కార్యక్రమాని ఆయన హాజరయ్యారు. ఉచితంగా పోషకాహారంతో కూడిన అన్నప్రసాదాన్ని అందిస్తున్న ఇస్కాన్ నిర్వాహకులను అభినందించారు. కలెక్టర్ స్వయంగా అభ్యర్థులకు భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థుల శిక్షణ, పరీక్షల సన్నద్ధత, ప్రిపరేషన్ విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి ప్రణవ నంద ప్రభు , బీసీ సంక్షేమ శాఖ అధికారి సోనియా, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, శిక్షణార్థులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేస్ట్ టు ఆర్ట్ ప్రదర్శనలో విద్యార్థుల కళాకృతులు భేష్

**విద్యార్థులను అభినందించిన జిడబ్ల్యుఎంసి కమిషనర్ వెంకన్న**

**వరంగల్, కార్పొరేషన్ మహా;** స్వచ్ఛత హి సేవా -2026 కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్లో సోమవారం నిర్వహించిన 'వేస్ట్ టు ఆర్ట్' (వ్యర్థాల నుండి కళాత్మక వస్తువుల రూపకల్పన) పోటీల్లో విద్యార్థులు రూపొందించిన సృజనాత్మక కళాకృతులు అందరిని ఆలోచింపజేసేలా ఆకట్టుకున్నాయి. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వ్యర్థ పదార్థాలను వినూత్నంగా పునర్వినియోగిస్తూ రూపొందించిన అలంకరణ వస్తువులు, బొమ్మలు, మొక్కల కుండీలు తదితర కళాఖండాలను ప్రదర్శించారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గా భేతి అశోక్ బాబు

**కమిటీ మెంబర్లకు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్**

**వరంగల్, కలెక్టరేట్ మహా ;** వరంగల్ జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి సోమవారం జరిగిన ఎన్నికల్లో సొసైటీ చైర్మన్ గా భేతి అశోక్ బాబు ఏకగ్రీవ ఎన్నిక అయ్యారు. మవారం జరిగిన ఎన్నికల్లో సొసైటీ వైస్ చైర్మన్ గా శానబోయిన రాజకుమార్, ట్రెజరర్ గా బొల్లం శివ , స్టేట్ ఎంసీ మెంబర్ గా నాడెం శాంతి కుమార్ కూడా ఏకగ్రీవంగా గా ఎన్నికయ్యారు. రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ మెంబర్లు గా కుసుమ సత్యనారాయణ రిటైర్డ్ తహసీల్దార్, తోట సంపత్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, మండల పరుషరాములు ఎన్‌జీ ఓ, మామిడాల రమేష్ బాబు అడ్వకేట్, వద్ది రాజు, టీఎన్జీవో చొప్పరి సోమయ్య, ఎన్జీవో ముల్క ప్రసాద్, పుల్లూరి వేణు ప్రముఖ న్యాయవాది, డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి, మోతె తిరుపతి రెడ్డి, డాక్టర్ గజవెల్లి రాజకుమార్, వీరు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్, ఇతర పదవుల ప్రతినిధులకు పలువురు ప్రముఖులు, ముఖ్య నాయకులు అభినందనలు తెలియజేశారు. అలాగే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వరంగల్ జిల్లా ప్రెసిడెంట్ , కలెక్టర్ డాక్టర్ సత్య శారదను మర్యాద పూర్వకంగా కలిసిన నేపథ్యంలో ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి

**సీఎస్ సంజయ్ జాజు**

**మంచిర్యాల, మహా :** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో భోజనం, పారిశుద్ధ్యం, వంటశాలల పరిశుభ్రత, ఉపాధ్యాయుల హాజరుపై కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాన్ని వేగవంతం చేసి 2027 నాటికి 15 నుంచి 20 పాఠశాలలు పూర్తి చేయాలన్నారు. ఫేస్ రికగ్నిషన్ ద్వారా హాజరు నమోదు, యూనిఫారాల పంపిణీ అక్టోబర్ 20 నాటికి పూర్తి చేయాలని, కేంద్రీకృత వంటశాలలను నవంబర్ మధ్య నాటికి ప్రారంభించాలని సూచించారు.

# గడ్డి మందు పై నిషేధం విధించిన కేంద్రం

- ఫలించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పోరాటం
- జాతీయ స్థాయిలో నిషేధం విధించాలని ఎంపీ పట్టు
- కేంద్ర వ్యవసాయ శాఖకు ఎంపీ కృతజ్ఞతలు

**హనుమకొండ, మహా ;** రైతులు, గ్రామీణ ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) పై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభ వేదికగా చేసిన పోరాటానికి కీలక ఫలితం లభించింది. పారాక్వాట్ డైక్లోరైడ్ వినియోగంపై ప్రమాదాలను వివరిస్తూ దేశవ్యాప్తంగా కఠిన చర్యలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మార్చి 27న లోక్‌సభ జీరో అవర్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ తర్వాత పరిణామాల్లో తెలంగాణ శాసనసభ కేంద్రాన్ని సంపూర్ణ నిషేధం విధించాలని కోరుతూ తీర్మానం చేయగా, రాష్ట్ర ప్రభుత్వం పారాక్వాట్ విక్రయం, నిల్వ, పంపిణీ, తయారీ, వినియోగంపై తాత్కాలిక నిషేధం విధించింది. తాజాగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సెప్టెంబర్ 22న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ లో పారాక్వాట్ డైక్లోరైడ్‌కు కొత్తగా రిజిస్ట్రేషన్ ఇవ్వడాన్ని నిషేధించింది. ఇప్పటికే కీటకనాశక చట్టం1968లోని సెక్షన్ 9 కింద ఇచ్చిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను రద్దు చేసినట్లుగా ప్రకటించింది. రిజిస్ట్రేషన్ కమిటీ ఆ సర్టిఫికెట్లను వెనక్కి తీసుకోవాలని, వాటిని తిరిగి ఇవ్వని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించింది. పారాక్వాట్ డైక్లోరైడ్ పై లోక్‌సభలో ఎంపీ లేవనెత్తిన అంశం కేంద్రం దృష్టిని ఆకర్షించి, తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలు ప్రజల ప్రాణాల రక్షణ దిశగా ముందడుగు కావడం పై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖకు ఈ ఈ సందర్భంగా ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.







# అక్రిడేషన్ కార్డుల జారీలో నిర్లక్ష్యం సహించేది లేదు

- నెలలు గడుస్తున్న జాప్యం చేయడం సరికాదు
- కలెక్టరేట్ ముందు వర్కింగ్ జర్నలిస్టుల నిరసన

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: అర్హులై ఉండి అక్రిడేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ వెంటనే కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు కొందరు వర్కింగ్ జర్నలిస్టులు నిరసన నిర్వహించి అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు వర్కింగ్ జర్నలిస్టులు మాట్లాడుతూ జిల్లాలో అనేక సంవత్సరాలుగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న పలువురు వర్కింగ్ జర్నలిస్టులు నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. అయితే దరఖాస్తులు సమర్పించి నెలలు గడుస్తున్నా ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో ఆందోళనకు దిగినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా రెండు దశాబ్దాలుగా వృత్తిలో కొనసాగుతున్న జర్నలిస్టులు సైతం అక్రిడిటేషన్ కార్డుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్ కేవలం గుర్తింపు కార్డు మాత్రమే కాదని దాని ఆధారంగా జర్నలిస్టులు వారి కుటుంబాలకు అందాల్సిన పలు సంక్షేమ ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని ఆందోళనకారులు తెలిపారు. కార్డుల జారీ ఆలస్యం కారణంగా హెల్త్ కార్డులు ఇతర సంక్షేమ సదుపాయాలను పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూ తమ వృత్తి బాధ్యతలు నిర్వర్తిస్తున్న జర్నలిస్టుల దరఖాస్తుల విషయంలో నెలల తరబడి జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. అర్హత కలిగిన దరఖాస్తులను వేగంగా పరిశీలించి, పెండింగ్ ప్రక్రియను పూర్తి చేసి అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని పరిశీలించిన కలెక్టర్ సమస్యను పరిష్కరించాల్సిందిగా సమాచార శాఖ అధికారిని ఆదేశించారు. ఈ ధర్నా కార్యక్రమంలో జర్నలిస్టులు మొగిలిపాక మురళీకృష్ణ, చింతల చిరంజీవి, కొండ జంపన్నతో పాటు పలువురు పాల్గొన్నారు. నిరసన కార్యక్రమానికి కొంతమంది సీనియర్ పాత్రికేయులు సంఘీభావం తెలిపారు.



# శ్రీనివాస కళ్యాణోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

**కుషాయిగూడ, మహా:** తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీనివాస శ్రీ కళ్యాణోత్సవానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని నిర్వాహకులు ఆహ్వానించారు. నాచారం బీఆర్టీ ఎంక్లేవ్, పోలీస్‌స్టేషన్ ఎదురుగా అక్టోబర్ 31న సాయంత్రం 3 గంటలకు శ్రీనివాస కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 29, 30, 31 తేదీల్లో ఉదయం 5 గంటలకు హోమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీ శ్రీనివాస సేవా ట్రస్ట్, నాచారం ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ నందికొండ శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి కళ్యాణోత్సవానికి హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆహ్వానించారు.

# పేపర్ వెండర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

**కమలానగర్‌లో న్యూస్ పేపర్ హాకర్స్ అసోసియేషన్ సభ**

**కుషాయిగూడ, మహా:** తెల్లవారుజామున నాలుగు గంటలకే నిద్రలేచి ఇంటింటికీ వార్తాపత్రికలను అందిస్తూ జీవనోపాధి సాగిస్తున్న న్యూస్ పేపర్ వెండర్లను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జి. వెంకటరమణ కోరారు. ఆదివారం కమలానగర్ న్యూస్ పేపర్ హాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా న్యూస్ పేపర్ డిస్ట్రిబ్యూషన్‌పై ఆధారపడి జీవిస్తున్న వెండర్ల జీవితాలపై కరోనా మహమ్మారి, సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా పడిందన్నారు. పేపర్ డిస్ట్రిబ్యూషన్ తగ్గిపోవడంతో వార్తాపత్రికలను నమ్ముకుని జీవిస్తున్న వారి జీవనోపాధి కష్టంగా మారిందని తెలిపారు.డ్వాక్రా మహిళలకు రుణాలు అందిస్తున్న తరహాలో న్యూస్ పేపర్ వెండర్లకు కూడా రుణాలు అందించి వారి జీవనోపాధికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. పేపర్ పంపిణీ చేసే సమయంలో ప్రమాదాలకు గురై గాయపడే వెండర్లకు ప్రభుత్వ సహాయం అందించాలని, అకాల మరణం సంభవించిన సందర్భాల్లో రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కమలానగర్ న్యూస్ పేపర్ హాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దశరథ్, కార్యదర్శి సుధాకర్, నరేష్, కామిని నరేష్, హమీద్, వెంకటరమణ, ప్రభు, చిత్తారి తదితర పేపర్ వెండర్లు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల ఇళ్ల కలకు మరింత ఊతం!

- **వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ చైర్మన్‌గా లాయక్ పాషా ఏకగ్రీవం**
- **విప్ ఆది శీనన్న సహకారంతో మరింత ముందుకు**



**వేములవాడ,మహా:** వేములవాడ ప్రాంతంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు నివేశన స్థలాలు అందించడంతోపాటు ఇప్పటికే మంజూరైన స్థలాలతో ఏర్పడుతున్న జర్నలిస్టు కాలనీ అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగేందుకు వేములవాడ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి లాయక్ పాషాను చైర్మన్‌గా ఏకగ్రీవంగా నియమిస్తూ ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.

**మంజూరైన స్థలాల అభివృద్ధిపై దృష్టి**

వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో సర్వే నంబర్ 391లో జర్నలిస్టుల కోసం మంజూరైన నివేశన స్థలాలతో కాలనీ రూపుదిద్దుకుంటోంది,అయితే స్థలాలు మంజూరు కావడం ఒక దశ మాత్రమేనని వాటిని నివాసయోగ్యంగా మార్చేందుకు రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని జర్నలిస్టులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ లాయక్ పాషా తెలిపారు.

**60 మంది జర్నలిస్టుల స్థలాల కోసం గతంలో ప్రయత్నం**

వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధన ప్రక్రియలో గతంలోనూ లాయక్ పాషా కీలకంగా పనిచేశారు, సుమారు 60 మంది జర్నలిస్టులకు నివేశన స్థలాలు కల్పించేందుకు జరిగిన ప్రయత్నాల్లో ముఖ్య భాగస్వామ్యం కావడంతో పాటు, ప్రస్తుతం ఏర్పడుతున్న కాలనీకి సంబంధించిన పలు అంశాలపై అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినట్లు తెలిపారు.

**కాలనీలో తొలి అడుగులు**

జర్నలిస్టు కాలనీలో మొట్టమొదటిసారిగా బొడ్రాయి ఏర్పాటు చేసి నిర్మాణ ప్రక్రియకు శ్రీకారం చుట్టడం, ఇంటి నంబర్ తీసుకోవడం వంటి కార్యక్రమాలు లాయక్ పాషా ఆధ్వర్యంలోనే జరిగాయి. కాలనీకి విద్యుత్ సౌకర్యం కూడా అందుబాటులోకి వచ్చింది

**ఇవి కాలనీ నిర్మాణానికి ప్రాథమిక వసతులు**

ఏర్పడుతున్నాయనడానికి సంకేతాలుగా నిలుస్తున్నాయి.

**నీటి సమస్యకు రెండు బోర్లు..**

కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనపై ఇటీవల ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు లాయక్ పాషా తెలిపారు. జర్నలిస్టు కాలనీ అవసరాలను వివరించడంతో రెండు బోరు బావులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు, నీటి వసతి ఏర్పాటైతే కాలనీలో నిర్మాణ పనులు, భవిష్యత్తులో నివాసం ఏర్పరుచుకునే కుటుంబాలకు కొంతమేర ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది.

**మిగిలిన అర్హులకూ స్థలాలే లక్ష్యం..**

ప్రస్తుతం మంజూరైన స్థలాలతో పాటు ఇంకా కొంతమంది అర్హులైన జర్నలిస్టులకు నివేశన స్థలాలు అందాల్సి ఉందని లాయక్ పాషా తెలిపారు. అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి స్థలాల సాధనకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

**సొసైటీ ముందున్న అసలు సవాలు ఇదే..**

హౌసింగ్ సొసైటీకి చైర్మన్ నియామకంతో బాధ్యత పూర్తికాదని,ఇప్పటికే మంజూరైన స్థలాలను పూర్తి స్థాయి జర్నలిస్టు కాలనీగా తీర్చిదిద్దడమే అసలు సవాలన్నారు... వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో జర్నలిస్టుల హక్కులు, సంక్షేమంపై మరింత ముందుకు సాగుతామన్నారు.భూమి, రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలతో పాటు అర్హులైన మిగిలిన జర్నలిస్టులకు స్థలాల సాధన, ప్రభుత్వ శాఖలతో నిరంతర సమన్వయం వంటి అంశాలు సొసైటీ ముందున్న ప్రధాన బాధ్యతలుగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో హౌసింగ్ సొసైటీని సమర్థవంతంగా నిర్వహిస్తూ జర్నలిస్టులందరి భాగస్వామ్యంతో కాలనీ అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ఏకగ్రీవ నియామకంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, జర్నలిస్టుల ప్రయోజనాల కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని లాయక్ పాషా తెలిపారు.హౌసింగ్ సొసైటీ చైర్మన్ గా నియమితులైన లాయక్ పాషకు పుర ప్రముఖులు, న్యాయవాదులు, జర్నలిస్టు సంఘం నాయకులు, సహచర జర్నలిస్టులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

# అభివృద్ధికి ఆమడ దూరంలో భద్రాద్రి కొత్తగూడెం

- **సీతారామ ప్రాజెక్ట్ ఎప్పుడు నిర్మిస్తారు..?**
- **సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ప్రశ్న**




**భద్రాద్రి కొత్తగూడెం, మహా**:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధిలో ఆమడ దూరంలో ఉందని ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ జిల్లా పట్ల వివక్షత చూపిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు విమర్శించారు. సోమవారం స్థానిక మంచికంటి భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముగ్గురు మంత్రులు ఉన్నా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి కోసం ప్రణాళిక బద్ధమైన కృషి చేయడం లేదని విమర్శించారు. ఆర్భాటపు ప్రచారాలు తప్ప ఆచరణలో ఇసుమంత కూడా అభివృద్ధి లేదన్నారు. అసలు నిధులు కేటాయించకుండానే సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందిస్తామని మంత్రులు ప్రగల్భాలు పలుకుతున్నారన్నారనీ విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేయకుండా మాటలు మోసపూరిత ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే వరకు పోరాటాల కొనసాగిస్తామని తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యా, వైద్యంపై నిర్వహించిన సర్వేలో ప్రభుత్వ ఆసుపత్రులు ప్రభుత్వ గిరిజన సామాజిక సంక్షేమ హాస్టళ్లు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయనీ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పర్మినెంట్ వైద్య సిబ్బంది మందులు సిరంజీలు కూడా లేకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల రక్త పరీక్షలు నిలిచిపోయాయన్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి అభివృద్ధికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు ప్రకటించిన మూడు కోట్ల రూపాయలు ఎటు పోయాయో అర్థం కావడం లేదన్నారు. సంక్షేమ హాస్టళ్లు నిధులు లేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. టాయిలెట్లు, మరుగుదొడ్ల సమస్య విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాన్లు లైట్లు కూడా పనిచేయడం లేదన్నారు. టీచర్లు లెక్చరర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ఏజెన్సీ జిల్లా పట్ల ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. వెంటనే ప్రభుత్వ విద్యాలయాలు ఆసుపత్రుల్లో పర్మినెంట్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

**మొండి గోడలకు ఎన్ని సార్లు పట్టాలిస్తారు?**

బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒకసారి మొండి గోడలకు పట్టాలిచ్చి, మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కూడా మళ్ళీ మొండి గోడలకే పట్టాలి ఇవ్వడం సరి అయినది కాదన్నారు. ఇలా మొండి గోడలకు డ్రా తీసి ఇల్లు ఇచ్చామని చెప్పుకోవడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యేకే తెలియకుండా ప్రభుత్వం పట్టాల పంపిణీ కార్యక్రమం పెట్టడం విడ్డూరంగా ఉందని అన్నారు. పాత కొత్తగూడెం ఇళ్ల స్థలాల పోరాటం కాసాని ఐలయ్య నాయకత్వంలో సిపిఎం నిర్వహించిందని గుర్తు చేశారు. రెండు వేల ఆరువందల అరవై మంది లబ్ధిదారులను గుర్తించి రెండు వందల పద్నాలుగు మందికే ఇస్తే మిగతా లబ్ధిదారులందరికీ ఎపుడు ఇస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాల్వంచలో ఏకపక్షంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు చేశారని విమర్శించారు. అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న పేదలని వదిలేసి ఇలా ఎటువంటి సర్వేలు నిర్వహించకుండా లబ్ధిదారులు ఎంపిక చేయడం తగదన్నారు. పాల్వంచ, కొత్తగూడెంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా రహదారులు ధ్వంసం అయినా మంత్రులు అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. గోదావరి నదికి అటువైపు ఇటువైపు భద్రాచలం నియోజకవర్గం పినపాక నియోజకవర్గంలో ధ్వంసమైన రహదారుల్ని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇసుక ద్వారా ఆదాయం అందుతున్న ప్రభుత్వం రహదారుల నిర్మాణాన్ని మరిచిందన్నారు. దీంతో పేదలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న భూమి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముగ్గురు మంత్రులు ఉన్న నిధుల కేటాయింపులో జిల్లాకు అన్యాయం జరుగుతుందని విమర్శించారు. కళ్ళకు కట్టినట్టుగా విద్యాలయాలను చూసినా ప్రభుత్వ వైద్యశాలలను చూసినా నిధుల లేమితో సతమతమవుతున్నాయన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజలను కలిసోచ్చే శక్తులను కలుపుకొని ప్రజా పోరాటాలకు సిద్ధం అవుతామని తెలిపారు.గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలి జిల్లాలో చుంచుపల్లి కొత్తగూడెం ఇల్లందుబచర్ల ప్రాంతాలలో ఇళ్ల స్థలాలు లేని పేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని ప్రజలకు స్థలం ఇచ్చి పక్కా ఇంటి నిర్మాణం చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న ప్రజలు కరెంటు మంచినీటి సౌకర్యం లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతూ జీవనాన్ని కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనికరం కలగడం లేదని విమర్శించారు. గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు పక్కా ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం కొరకు కేటాయించిన నిధులను ఖర్చుపెట్టకుండా ప్రాజెక్టు ద్వారా ప్రజలకు నీళ్లు ఎలా అందిస్తారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా అభివృద్ధి చేయడంలో చిత్తశుద్ధి లేదన్నారు. ఫలితంగా జిల్లా ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బ్రహ్మచారి, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# శంషాబాద్ లో ఘోరం

- **మహిళపై లైంగిక దాడికి యత్నించిన క్యాబ్ డ్రైవర్**
- **నిందితుని కోసం సీసీ పుటేజిని శోధిస్తున్న పోలీసులు**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ నగరంలో ప్రయాణిస్తున్న ఒక మహిళపై క్యాబ్ డ్రైవర్ లైంగిక దాడికి యత్నించిన ఘటన తీవ్ర కలకలంరేపింది. సంఘటన శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీస్ అధికారి సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం,, దేవరకొండ శివాజీ నగర్ కు చెందిన నాయిని నందిని (38) ఒంటరి మహిళ (అనాధ) ఈ నెల 26 న హైదరాబాద్ లోని తన బంధువుల ఇంటికి రావడానికి దేవరకొండ నుంచి జడ్చర్ల కు వచ్చింది. అక్కడ హైవేపై నిలిచింది. సమయంలో ఒక క్యాబ్ డ్రైవర్ తన క్యాబ్ లోకి ఆమెను ఎక్కించుకున్నాడు. శంషాబాద్ లోని తొండుపల్లి ఓఆర్ఆర్ ఎగ్జిట్ వద్ద హైదరాబాదు వెళ్లకుండా అక్కడి నుంచి రాళ్లగూడ సర్వీస్ రోడ్డు మీదుగా నర్కూడ వైపు వెళ్ళాడు. ఆమెపై లైంగిక దాడి కి అనుకూల పరిస్థితులు లేకపోవడంతో వెనుదిరిగి రాళ్లగూడ నుంచి కొత్వాల్ గూడ సర్వీస్ రోడ్డు వైపు తీసుకెళ్లాడు. కారును నిర్మాణస్య ప్రదేశంలోకి తీసుకెళ్ళి బలవంతం చేసే ప్రయత్నం చేయగా ఆమె ప్రతిఘటించడంతో ఆమెను అక్కడే వదిలేసి ఆమె తన వెంట తెచ్చుకున్న 60 వేలరూపాయలతో పారిపోయాడు. ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అతని కారు నెంబర్ ఆధారంగా సీసీ ఫుటేజ్ లను శోధిస్తున్నారు. నిందితుని చిరునామా తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తే వికారాబాద్ జిల్లా వైపు చూపిస్తుంది. అతన్ని పట్టుకోవడానికి రెండు పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని పోలీసులు తెలిపారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

**కౌన్సిలర్ తూము మధు**



వేములవాడ,మహా : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన గొప్ప విప్లవ వీరుడు భగత్ సింగ్ త్యాగం నేటి యువతకు ఆదర్శమని వేములవాడ కౌన్సిలర్ తూము మధు అన్నారు. భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా న్యూ అర్బన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.అతి చిన్న వయస్సులోనే దేశ బానిసత్వ సంకెళ్లను తెంచేందుకు భగత్ సింగ్ చేసిన పోరాటం ఎనలేనిదన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, కంకెల్కార్ మోహన్, అంగన్‌వాడీ టీచర్లు లిక్కిడి మంజుల, పులి శారద, నాయకుడు భాస్కర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# పివి సత్యనారాయణ మూర్తి సేవలు అభినందనీయం

- **అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: అంబేద్కర్ ఆశయాల సాధనకై పివి సత్యనారాయణ మూర్తి అందిస్తున్న విశిష్ట సేవలను ప్రతి ఒక్కరూ మార్గదర్శకంగా తీసుకోవాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. పివి సత్యనారాయణమూర్తి ఉమ్మడి ఖమ్మం జిల్లాలలో డిగ్రీ రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులకు "ఉన్నత విద్య అంబేద్కర్ ఇజం" అనే అంశంపై అవగాహన తరగతులు నిర్వహిస్తూ పాల్వంచకు వెళుతున్న సందర్భంలో ఆయనను సోమవారం స్థానిక అతిథి గృహానికి ఆహ్వానించి విశిష్ట సేవలను ప్రశంసిస్తూ పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మద్దెల మాట్లాడుతూ సత్యనారాయణ మూర్తి సివిల్ సర్వీసెస్ గ్రూప్ వన్ అధికారిగా డిఫెన్స్ సేఫ్టీ అకౌంట్లో ఉన్నత అధికారిగా సేవలందిస్తూ భారతరత్న భారత రాజ్యాంగ సృష్టికర్త బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో వారి ఆశయాల సాధన కోసం అంతటి ఉన్నత ఉద్యోగాన్ని తృణప్రాయంగా ఎంచుకొని విఆర్ఎస్ తీసుకొని పూర్తి సమయాన్ని అంబేద్కర్ ఆశయాల సాధన కోసం కృషి చేయడం మరువలేనిదన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ప్రత్యేకంగా డిగ్రీ రెసిడెన్షియల్ కాలేజ్ విద్యార్థులకు "ఉన్నత విద్య అంబేద్కర్ ఇజం" అనే టాపిక్ పై విద్యార్థులకు పూర్తి అవగాహన మోటివేషన్ క్లాసెస్ నిర్వహిస్తూ అనునిత్యం అంబేద్కర్ ఆశాల సాధన కోసం కృషి చేస్తున్న పివి సత్యనారాయణమూర్తి సేవలు ఎంతో అభినందనీయమని ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం మార్గదర్శకం అని ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ వుద్ఘాటించారు.ఈ ఆత్మీయ అభినందన కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ లతో పాటు రిటైర్డ్ ప్రిన్సిపల్ ప్రముఖ అంబేద్కర్ వాది ఎన్. వెంకటేశ్వర్లు, టీఈఎయం రాష్ట్ర కన్వీనర్ ప్రముఖ అంబేద్కర్ వాది దాసరి రమేష్, రాష్ట్ర కో కన్వీనర్ శెట్టి కమలాకర్, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉపాధ్యాయ ఉద్యమ యోధులు డి.సుధాకర్, సంఘ జిల్లా ఆర్గనైజర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి పురుషోత్తం, సంఘ సెక్రటరీ కదలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జయంతి వేడుకలు..

- **జాషువా సాహిత్యం సమానత్వానికి మార్గదర్శకం..**
- **వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి వాల్య**

**మణుగూరు, మహా** : ప్రముఖ కవి, సామాజిక చైతన్యవేత్త, నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత గుఱ్ఱం జాషువా జయంతి వేడుకలను మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి వాల్య మాట్లాడుతూ గుఱ్ఱం జాషువా తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సమాజంలో కుల వివక్ష, అసమానతలను ప్రశ్నిస్తూ మానవతా విలువలు, సమానత్వ భావనలను తన రచనల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన మహాకవి జాషువా అని కొనియాడారు. సమాజంలో సమానత్వం, మానవత్వం, సామాజిక చైతన్యం పెంపొందించడంలో ఆయన రచనలు విశిష్టమైన పాత్ర పోషించాయని పేర్కొన్నారు. విద్యార్థులు జాషువా సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎస్. రమేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి భాస్కర్‌రావు, డాక్టర్ అశోక్ శివకుమార్, డాక్టర్ సాంబమూర్తి, నాగిరెడ్డి, బి సతీష్, కె శిరీష, ఎస్ సువర్ణ, నవీన్‌కుమార్, రఘుపతి, స్నేహ, సుజాతతో పాటు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# ఓటర్ సవరణ ప్రక్రియపై భగ్గుమన్న జిల్లా కాంగ్రెస్

- **సీఈసీ రాజీనామాకు డిమాండ్**
- **రాస్తారోకో, నిరసనలతో స్తంభించిన ట్రాఫిక్**
- **పాల్గొన్న డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ, కుడా చైర్మన్, కాంగ్రెస్ శ్రేణులు**

**వరంగల్, పోచమ్మ మైదాన్ మహా** : కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఓటర్ సవరణ ప్రక్రియ పై తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని నిరసిస్తూ ఏఐసీసీ, టీపిసిసి ఆదేశాల మేరకు సోమవారం పోచమ్మ మైదాన్ సెంటర్లో వరంగల్ జిల్లా డిసిసి అధ్యక్షులు మహమ్మద్ అయుబ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకో తో పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్ పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, జి.డబ్ల్యు.ఎం.సీ. మాజీ మేయర్ గుండు సుధారాణి శాసనమండలి సభ్యులు, మాజీ మంత్రి బసవరాజు సారయ్య తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాల పై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు, సుమారు గంట పాటు నిర్వహించిన ఈ రాస్తారోకో నిరసన కార్యక్రమం వల్ల పోచమ్మ మైదాన్ సెంటర్లో నాలుగు దిక్కులా ట్రాఫిక్ స్తంభించిపోయింది. అనంతరం వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం గుండు సుధారాణి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రజలను, ఓటర్లను అయోమయానికి గురి చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఈ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పై ప్రధాన ఎన్నికల కమిషనర్ కు మిగతా ఇద్దరి కమిషనర్ల మధ్యన సమన్వయం లేకపోవడం వల్ల ఈ ప్రభావం ఓటర్ల తొలగింపు పై పడుతుందని అన్నారు. ఈ సర్ ప్రక్రియ లో చాలా లోపాలు ఉన్నాయని అర్హులైన ఓటర్లను కూడా అన్యాయంగా తొలగిస్తూ ఓటు చోరీ కి పాల్పడు తున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ ఎప్పటినుండో దీనిపై పోరాడుతున్నారని గుర్తు చేశారు. ఈ అంశంపై వెంటనే కేంద్ర ఎన్నికల కమిషనర్ల పై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- **జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్, కలెక్టరేట్ మహా;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 220 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో రెవెన్యూ శాఖకు 56, జీడబ్ల్యూఎంసి 74, హౌసింగ్ శాఖకు 16, డీఆర్డీవో 15 రాగా ఇతర శాఖలకు సంబంధించిన 59 దరఖాస్తులు వచ్చాయి. స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్ చేసి, సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో రెవెన్యూ, హౌసింగ్, జీడబ్ల్యూఎంసీ, డిఆర్డిఓ శాఖల పరిధిలో అధికంగా దరఖాస్తు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రజావాణి దరఖాస్తులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్ కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జడ్పీ సీఈవో వసంత, డీఎంహెచ్‌వో డా. రాజిరెడ్డి, కలెక్టరేట్ సూపరిడెంట్ విశ్వప్రసాద్ తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ఎంజీఎం లో భద్రతా చర్యల పై వరంగల్ సీపీ సమీక్ష

**వరంగల్, ఎంజీఎం** :వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రిలో భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యలు, ప్రస్తుతం ఉన్న భద్రతా ఏర్పాట్లు, భవిష్యత్తులో చేపట్టాల్సిన భద్రతా చర్యల పై ఎస్పీఎఫ్ పోలీసు ఉన్నతాధికారులు సోమవారం ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ ను మర్యాద పూర్వకంగా కలిసి ఎంజీఎం ఆస్పత్రిలో భద్రతా ఏర్పాట్ల పై క్షేత్రస్థాయిలో చర్చించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ను కలసిన వారిలో ఎస్పీఎఫ్ కమాండెంట్ కోటేశ్వర రావు, ఇన్స్పెక్టర్ భీమా తదితరులు ఉన్నారు.



## భగత్ సింగ్ ఆశయాలను యువత అనుసరించాలి

- ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ

**మందమర్రి, మహా** : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు భగత్ సింగ్ జయంతి వేడుకలను ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మందమర్రి బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్, ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభుదేవలు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఆయన జీవితం, దేశం కోసం చేసిన త్యాగాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్ త్యాగం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో యువతలో దేశభక్తిని నింపారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నదిపాటి రాజ్ కుమార్, కార్యదర్శి గాండ్ల సంజీవ్ పటేల్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఇబ్రహీం, ఎం.డి. జావిద్ పాషా, సుందర్, నాగరాజు, బుధ్వి శివ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధ మహిళను చితకబాదిన నోముల గ్రామస్తులు.!

- చేతబడి చేస్తుందని నెపంతో ఆమెపై దాడి.!
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన..
- బాధితుల ఫిర్యాదుతో 14 మందిపై కేసు నమోదు...



**బ్రహీంపట్నం సెప్టెంబర్ 28 మహా** : చేతబడి చేస్తుందని నెపంతో, నోముల గ్రామంలో వృద్ధ మహిళను, విచక్షణ రహితంగా దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని నోముల గ్రామంలో మంత్రాలు చేతబడి చేస్తుందనే నెపంతో, అదే గ్రామానికి చెందిన వృద్ధ మహిళ (60)ను గ్రామస్తులు చెట్టుకు కట్టేసి విచక్షణ రహితంగా చితకబాదారు. దీంతో బాధితులు మంచాల పోలీసులను ఆశ్రయించగా, ఫిర్యాదు అందుకున్న పోలీసులు, దాడికి పాల్పడ్డ 14 మందిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు వెల్లడించారు. వృద్ధ మహిళ వెంకటమ్మపై విచక్షణ రహితంగా దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు.

## కందుకూరులో కేంద్ర ఎన్నికల కమిషనర్ ఏకపక్ష విధానాలపై నిరసన.!

- ప్రజాస్వామ్య పరిరక్షణ ఓటర్ల హక్కుల కోసం పోరాటం చేస్తాం...
- ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్
- జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ




**కందుకూర్ సెప్టెంబర్ 28 మహా :** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ఓటర్ల హక్కుల కోసం పోరాటం చేస్తామని, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ అన్నారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష ధోరణికి, ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలకు నిరసనగా ఏఐసీసీ ఆదేశానుసారం, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కందుకూరులో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. సామ నర్సింహారెడ్డి గార్డెన్స్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నల్ల దుస్తులు ధరించి నిరసన ర్యాలీ చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ హాజరై ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ఓటర్ల హక్కుల కోసం పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాల, జిహెచ్ఎంసి సర్కిల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, పార్టీ శ్రేణులు నాయకులు, ఎన్ఎస్యుఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ భారీ నిరసన



**మంచిర్యాల, మహా :** ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట జిల్లా కాంగ్రెస్ భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష ధోరణికి, ఎస్. ఐ.ఆర్. ప్రక్రియలో అవకతవకలు జరిగిన నేపథ్యంలో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు.అనంతరం సీఈసీ దిష్టిబొమ్మను దహనం చేసి, అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. ప్రక్రియపై పారదర్శక విచారణ జరిపి ఓటర్ల హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు. సిటీ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మల నరేష్ మాట్లాడుతూ ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా పదాధికారులు, మండల, పట్టణ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 49 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. జైపూర్ మండలం కిష్టాపూర్‌కు చెందిన సుందిళ్ల రాజయ్య పట్టా భూమి నిషేధిత జాబితాలో ఉందని, కాసిపేట మండలం కోమటిచేనకు చెందిన జాడి అనసూర్య జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కోసం, బెల్లంపల్లికి చెందిన ఆలేటి భాగ్యలక్ష్మి ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తులు అందజేశారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి.రాములు, డీఆర్వో మోతీరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ పాల్గొన్నారు.

# బెల్లంపల్లి మున్సిపల్‌లో ముదురుతున్న రాజకీయ వివాదం

- రూ.10 లక్షల ఆరోపణలు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం..
- నిరూపించకపోతే చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తారా?
- మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతికి బీఆర్ఎస్ కౌన్సిలర్ల సవాల్




**బెల్లంపల్లి,మహా**: బెల్లంపల్లి పట్టణంలోని మున్సిపల్ లో రాజకీయ వివాదం క్రమక్రమంగా ముదురుతోంది. బిఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ ను కాంగ్రెస్ పార్టీలోకి రావాలని రాజకీయ ఒత్తిళ్లు చేయడం నిధుల విషయంలోనూ ఆర్పీ ఎంపిక విషయంలోనూ మున్సిపల్ చైర్ పర్సన్ తో పాటు ఆమె భర్త జోక్యం చేసుకొని వివాదం సృష్టిస్తున్నారని బిఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు స్రవంతి సల్ల కృష్ణవేణిల రాజకీయ వివాదం నెలకొని సవాళ్లకు ప్రతి సవాళ్లు ఇరు వర్గాలు విసురుకోవడం పట్టణంలో చర్చనీయాంశం అయింది. ఈ నేపథ్యంలో ఆదివారం నాడు మున్సిపల్ చైర్ పర్సన్ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు సమావేశాలు నిర్వహించగా సోమవారం నాడు పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు సల్ల కృష్ణవేణి, తాంద్ర స్రవంతి మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ ఇటీవల నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చారు. తమపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ, ఆధారాలతో నిజానిజాలను నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి మాట్లాడుతూ.. తన వార్డుకు చెందిన ఆర్పీ అరుణ విషయంలో చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆర్పీ తనకు పరిచయం లేదని చైర్‌పర్సన్ మీడియా ముందు చెప్పడం సరికాదన్నారు. ఆర్పీ ఎంపికైన సమయంలో వార్డు ఓబీ సభ్యులు చైర్‌పర్సన్ నివాసానికి వెళ్లి ఆమెను సన్మానించి మర్యాదపూర్వకంగా కలిసిన విషయాన్ని గుర్తుచేశారు.బెల్లంపల్లిలో పలువురు ఆర్పీలు తమ విధులతో పాటు ఇతర పనులు, వ్యాపారాలు కూడా చేస్తున్నారని, అలాంటప్పుడు తన వార్డులోని ఆర్పీ విషయంలోనే ఎందుకు ప్రత్యేకంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆమె ప్రశ్నించారు. తాను రూ.10 లక్షలు తీసుకున్నానంటూ చైర్‌పర్సన్ ఆరోపణలు చేశారని, ఆ ఆరోపణలను నిరూపిస్తే తన కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఆరోపణలను నిరూపించలేకపోతే చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారా? అని ప్రతిసవాల్ విసిరారు.తన వార్డుకు చెందిన ఆర్పీకి నోటీసు జారీ చేసిన విషయంపై మున్సిపల్ కమిషనర్ , దుర్గయ్యను వివరణ కోరగా, చైర్‌పర్సన్ దావ స్వాతి తన లెటర్‌ప్యాడ్ పై వ్రాసి ఇచ్చారని కమిషనర్ తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న తర్వాతే తాను ప్రెస్‌మీట్ నిర్వహించానని పేర్కొన్నారు.అయితే, ఆర్పీలందరూ కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారని, ఆర్పీని తొలగించే విషయంలో తనకు సంబంధం లేదని చైర్‌పర్సన్ చెప్పడం విరుద్ధంగా ఉందన్నారు. ఆర్పీ అరుణ తనకు తరచూ ఫోన్ చేస్తుందని, తన వద్ద రికార్డులున్నాయని చైర్‌పర్సన్ చెప్పినట్లు పేర్కొంటూ, సంబంధిత వ్యవహారంలో తన వద్ద ఆధారాలు సైతం ఉన్నాయని తెలిపారు.తనపై చేస్తున్న ఆరోపణలకు సంబంధించి ప్రతి అంశానికీ ఆధారాలు ఉన్నాయని, తాను క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అవసరమైతే కోర్టులో పరువునష్టం దావా వేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ తాంద్ర స్రవంతి మాట్లాడుతూ ఇటీవల ఆదివారం నాడు నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చైర్‌పర్సన్ తమను "జస్ట్ కౌన్సిలర్లు" అని సంబోధించడం బాధాకరమన్నారు. చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ కూడా 7వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారని, అనంతరం కౌన్సిలర్ల మద్దతుతోనే చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారని గుర్తుచేశారు. అలాంటప్పుడు కౌన్సిలర్లను తక్కువ చేసి మాట్లాడటం సమంజసంకాదన్నారు.బీఆర్ఎస్ పార్టీలోకి కౌన్సిలర్లను చేర్చుకోబోమని చైర్‌పర్సన్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులకే కాకుండా సామాన్య కార్యకర్తలు, పేదలు, ధనికులు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరిని పార్టీలో స్వాగతం పలుకుతున్నామని తెలిపారు. ప్రజల కోసం బీఆర్ఎస్ పార్టీ తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని పేర్కొన్నారు.కాకా కుటుంబంపై తమకు గౌరవం ఉందని చెబుతూనే, బెల్లంపల్లి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ వ్యవహరిస్తున్న తీరును కాకా కుటుంబ సభ్యులు గమనించాలని సూచించారు. కౌన్సిలర్లను కేవలం జస్ట్ కౌన్సిలర్లుగా సంబోధించడం ద్వారా భవిష్యత్తులో కాకా కుటుంబ వారసులు ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ప్రజాప్రతినిధులను ఓట్లు అడిగే విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు.చైర్‌పర్సన్ తనపై రూ.10 లక్షల వ్యవహారంలో రూ.5 లక్షలు తీసుకున్నారంటూ ఆరోపణలు చేశారని, ఆ ఆరోపణలను నిరూపిస్తే తాను కూడా రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు.బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆర్పీ కోసం మాత్రమే మాట్లాడుతున్నారన్న వ్యాఖ్యలను ఖండిస్తూ, బెల్లంపల్లి పట్టణ ప్రజల్లో ఎవరికీ ఏ సమస్య వచ్చినా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ముందుండి పోరాడతారని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై స్పందించడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు పరస్పర గౌరవంతో వ్యవహరించాలని, తమపై చేసిన ఆరోపణలను నిరూపించాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. అవసరమైతే న్యాయపరంగా పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.



## ముగిసిన కబడ్డీ ఎంపిక పోటీలు

**బెల్లంపల్లి, మహా:** అండర్ గ్రౌండ్ జిల్లా స్థాయి బాలికల కబడ్డీ ఎంపిక పోటీలను పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జడ్పీ ఎచ్ఎస్ అచలాపూర్ లో నిర్వహించగా ఎంపిక పోటీలు సోమవారం రోజుతో ముగిసాయి .అండర్14 జిల్లాస్థాయి బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి పేర్కొన్నారు. సంబంధిత పోటీలకు మంచిర్యాల జిల్లాలోని వివిధ మండలాల నుండి సుమారు 150 మంది విద్యార్థినిలు పాల్గొన్నారని పాఠశాల వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు ఏ. సాంబమూర్తి తెలిపారు. ఎంపికైన వారిలో జిల్లా నుండి జోనల్ కు సెలెక్ట్ అయిన విద్యార్థులు శ్రీ చైతన్య హై స్కూల్ నుండి కుందన, ట్రినిటీ హైస్కూల్ నుండి బి హర్షిత, రేవలేషన్ స్కూల్ నుండి సిహెచ్ సాహితి ,భీమిని జడ్పిహెచ్ఎస్ నుండి మౌనిక, జడ్పిహెచ్ఎస్ నుండి బి రమాదేవి, ఆల్ ఫోర్స్ స్మార్ట్ స్కూల్ నుండి సుదీష, జడ్పిహెచ్ఎస్ భీమినీ నుండి ఎం శాన్విక,రేవలేషన్ స్కూల్ రిషిక,జడ్.పి.హెచ్.ఎస్ భీమిని ఎస్ కె సన, కేజీబీవీ నస్పూర్ నుండి ఎం రమాదేవి, భీమిని జడ్పీహెచ్ఎస్ నుండి ఏం ప్రవళిక ,మంచిర్యాల శ్రీనిమ్స్ నుండి బిందు, ట్రినిటీ హై స్కూల్ నుండి రిత్విక, అచలాపూర్ జడ్పిహెచ్ఎస్ శ్రీ హర్షిణి,మంచిర్యాల జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హై స్కూల్ నుండి అక్షిత, అద్వైత లు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.పోటీలకు సభా అధ్యక్షులుగా పాఠశాల హెచ్ఎం పి. ఉమాదేవి వ్యవహరించగా కార్యక్రమంలో సర్పంచ్ మారిశెట్టి స్రవంతి శ్రీనివాస్, మండల విద్యాధికారి శ్రీనివాస్, ఎస్ జి ఎఫ్ సెక్రటరీ యాకూబ్ , వార్డు సభ్యులు దాగం పాపయ్య, పోచయ్య, కొండు సాయి, విజయ్ కుమార్ , పాఠశాల ఉపాధ్యాయులు డి రాజేశ్వరరావు , శ్రీనివాస్ గౌడ్ , సుధాకర్ , హరి ప్రసాద్, భాస్కర్ , అంజిరెడ్డి, కే శ్రీనివాస్, సురేందర్ , రాజ్యలక్ష్మి, సి ఆర్ పి నాగరాజు, తిరుపతి గ్రామస్తులు మరియు జిల్లాలోని వివిధ పాఠశాలల పీడీ, పీఈటి లు స్టీఫెన్ రవీంద్ర,నక్క విజయచందర్ రావు,ప్రవీణ్, కుమార్,సదానందం, ఎం అశ్విని, తిరుమల లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో నడుస్తున్న పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ వెంటనే సీజ్ చేయాలి

**సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్..**



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ రెవెన్యూ లోగల సర్వే నెంబర్ 151లో ప్రభుత్వ భూమిలో బీజేపీ ఎమ్మెల్సీకి చెందిన పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ నడుస్తున్నది. వెంటనే రద్దు చేసి ఆ భూమి ప్రభుత్వాధినంలోకి తీసుకోవాలని సీపీఎం మొయినాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లీ దేవేందర్, మొయినాబాద్ మండల కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. మొయినాబాద్ మండల, మున్సిపాలిటీ పరిధిలో అనేక ప్రభుత్వ భూములు కబ్జాకి గురవుతున్నాయని మండల రెవెన్యూ యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. దీనిపై వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి మొయినాబాద్ మండల పరిధిలో ప్రభుత్వ భూములు బడాబాబుల చేతుల్లో ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ బీఆర్ఎస్ , బీజేపీ పార్టీల నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వ భూములు కబ్జా చేశారని వాటిని ప్రభుత్వం వెనక్కి తీసుకొని పేదలందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్‌ను వెంటాడుతున్న విష జ్వరాలు, మురుగునీటి కష్టాలు

- ప్రబలుతున్న విష జ్వరాలు
- తక్షణమే స్పందించి... పరిష్కరించాలంటున్న వివిధ కాలనీల ప్రజలు




**జవహర్ నగర్, మహా :** అదో పెద్ద పూర్వ మున్సిపల్ కార్పొరేషన్, దాదాపుగా వందకు పైగా కాలనీల ఆవాసం, లక్షకు పైచిలుకు జనాభా, 28 పూర్వ డివిజన్లు, జంట నగరాలకు కూతవేటు దూరంలో వెలసిన నగరం. ఘనమైన చరిత్రకు ఆలవానం. జిల్లాలోనే అతిపెద్ద గ్రామం. అదే జవహర్ నగర్ ఇంత పెద్ద జవహర్ నగర్ వసతుల లేమితో విల విలలాడుతుంది. ఇటీవలే మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి విలీనం చేసినా సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతుంది. ముఖ్యంగా జవహర్ నగర్ కు ప్రధాన సమస్యగా మారిన డ్రైనేజీ సమస్య ప్రజలను ఇబ్బంది పెడుతూ ప్రతి కాలనీలకు కొరగానీ కొయ్యలా తయారయింది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ కు పెద్ద చరిత్ర ఉంది జవహర్ నగర్ మొదటగా గ్రామపంచాయతీగా ఏర్పడి, ఆ తర్వాత మేజర్ గ్రామ పంచాయతీగా, పిదప మున్సిపాలిటీగా అవతరించిన రాజకీయ పరిపాలన కారణాలతో ప్రత్యేక నగర పాలక సంస్థగా ఉద్భవించింది. ఆ తర్వాతనే జవహర్ నగర్ లో ప్రతి కాలనీలకు డ్రైనేజీ సమస్య కొరకరాని కొయ్యలా తయారైంది. జవహర్ నగర్ కు డంపింగ్ కొండ నుండి వెలబడుతున్న కాలుష్యంతో పాటు వివిధ కాలనీలలో పొంగి ప్రవహిస్తున్న మురుగునీరు, చెత్తాచెదారాలతో, కాలుష్యపు గాలితో, కొట్టుమిట్టాడుతుండగా ఇటీవల విష జ్వరాల బారిన పడి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ ,వీధిదీపాలు, పారిశుధ్యం, లేమితో కొట్టుమిట్టాడుతుండగా ప్రజలకు డంపింగ్ యార్డ్ వల్ల వెలువడుతున్న కాలుష్యం మరో కారణం. హైదరాబాదును మూడు విభాగాలుగా విభజించిన తర్వాత జవహర్ నగర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వెళ్ళింది. కానీ మూలిగే నక్క మీద తాటిపండు పడ్డ చందంగా అసలే సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్న జవహర్ నగర్ కు డ్రైనేజీ ప్రధాన సమస్యగా తయారైంది. ఎన్ని వినతులు ఇచ్చిన సిబ్బంది కొరత లేమిటి వందకు పైగా వెలసిన కాలనీలలోని డ్రైనేజీ తదితర ప్రధాన సమస్యలను నెరవేర్చడంలో మున్సిపల్ సిబ్బందికి తలకు మించిన భారంగా తయారైంది. పరిపాలనా సౌలభ్యం కొరకు నగరాన్ని మూడు భాగాలుగా విభజించి అధికార వికేంద్రీకరణ సులభతరం చేసిన ప్రభుత్వం జవహర్ నగర్ ను ప్రత్యేక ప్రాంతంగా గుర్తించి తాగునీరు, డ్రైనేజీ సమస్య,, ప్రధాన వీధివీపాల సమస్యలు తక్షణమే పరిష్కరించవలసిందిగా జవహర్ నగర్ ప్రజలు కోరుతున్నారు. రాబోయే శీతాకాలం దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా జవహర్ నగర్ నుశుభ్రత పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి మున్సిపల్ అధికారులు ముఖ్యంగా మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జవహర్ నగర్ పై ప్రత్యేక యంత్రాంగాన్ని, వైద్య సిబ్బందిని నియమించి వైద్య సౌకర్యాల కొరకు ప్రత్యేక వైద్య క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలను రోగాల వారి నుండి కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు. అలాగే జవహర్ నగర్ లో డ్రైనేజీ కష్టాలు విద్యుత్ తదితర సమస్యలను తీర్చవలసిందిగా ప్రజలు కోరుకుంటున్నారు.



## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కి వినతిపత్రం అందజేసిన వాటర్ మేన్స్

**రాజేంద్రనగర్ మహా :** గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, జిహెచ్ఎంసి లో వాటర్ మేన్స్ గా గత 25 సంవత్సరాలుగా పనిచేస్తున్నాం. 25 సంవత్సరాలుగా సర్వీస్ అందిస్తున్న తమకు ఎలాంటి గుర్తింపు,పర్మనెంట్ , సర్వీస్ బుక్కులో గాను, బేసిక్స్ ఇవ్వలేదు. మాకు జీతాలు పెరిగే సమయంలో వాటర్ మేన్స్ ని జిహెచ్ఎంసి నుంచి హైదరాబాద్ మెట్రోపాలిటన్ నీటి సరఫరా,మురుగునీటి (జలమండలి)కి మారుస్తున్నారు. జిహెచ్ఎంసి ప్రకారం సెప్టెంబర్ నుంచి 19500 రూపాయలు జీతాలు ఇవ్వాల్సింది. జిహెచ్ఎంసిలో కార్మికులందరికీ జీతాలు పెంచి ఇచ్చారు.వాటర్ మేన్స్ కి మాత్రం పెంచకుండా హైదరాబాద్ మెట్రోపాలిటన్ నీటి సరఫరా,మురుగునీటి (జలమండలి)కి అక్టోబర్ నుండి అప్పగిస్తామంటున్నారు. అధికారులు మమ్మల్ని జలమండలి కి అప్పగించకుండా జిహెచ్ఎంసి లోనే పని కల్పించాలి. జిహెచ్ఎంసి కార్మికులతో సమానంగా పెంచిన జీతాలు ఇవ్వాలని సోమవారం శంషాబాద్ వాటర్ మేన్స్ సభ్యులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కి వినతి పత్రం అందజేశారు.

## ఆత్మహత్య పాల్పడ్డ జిహెచ్ఎంసి డ్రైవర్.!

**ఆదిభట్ల సెప్టెంబర్ 28 మహా:** కుర్మల్‌గూడలోని అపార్ట్మెంట్లో నివాసముంటున్న అంబన్న అనే డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని, బాలాపూర్ మండలం కుర్మల్‌గూడలోని ఓ అపార్ట్మెంట్ రెండో అంతస్తులో నివాసముంటున్న అంబన్న (23) అనే వ్యక్తి జిహెచ్ఎంసిలో డ్రైవర్గా విధులు నిర్వహిస్తూ జీవనం కొనసాగించేవాడు. ఇటీవల తన భార్య ప్రసవం అనంతరం పుట్టింటికి వెళ్లడంతో తను ఒక్కడే ఉండేవాడు. గత మంగళవారం 22 తారీఖున మృతుడి విధులకు వెళ్లడానికి, అతని తండ్రి నిద్ర లేపడానికి తెల్లవారుజామున వచ్చి తలుపు తట్టినా మృతుడు తీయకపోవడంతో, కిటికీ నుంచి గదిలోకి చూడగా, అంబన్న ఫ్యాన్ కొక్కెనుకు వేలాడుతూ కనిపించగా చుట్టుపక్కల వారి సాయంతో కిందికి దించాడు. అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. ఆలస్యంగా ఈనెల 28 ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో మృతుడి తండ్రి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నట్లు వెల్లడించారు. అంబన్న మద్యానికి బానిసై మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని, అతని మరణం పట్ల ఎలాంటి అనుమానాలు లేవని, మృతుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.



### డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు



వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. మురికి నీటి వాసనతో కాలనీలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం స్పందించి మురికి నీటి కష్టాలు తీర్చ వలసిందిగా కోరుతున్నాం.

**(కారింగుల రాజు, అంబేద్కర్ నగర్)**

**జ్వరం బాధతో పనికి వెళలేకపోతునా**



మురుగు నీటి వల్ల అనారోగ్యానికి గురయ్యా. చెడు వాసనలతో జ్వరం రాగా దావాఖానాలో, చూపించుకుందామంటే డబ్బులు లేవు. జ్వరంతోనే పనికి వెళ్ఎళలేక ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నాను.

**(మల్లేష్, కెఎన్ఆర్ కాలనీ).**

# బ్లాక్ లుక్‌లో నువేక్ష సందడి

**సినిమాబ్యూరో, మహా**: టాలీవుడ్ నటి నువేక్ష తాజాగా తన స్టైలిష్ లుక్‌తో మరోసారి అభిమానులను ఆకట్టుకుంటున్నారు. బ్లాక్ కలర్ డ్రెస్‌లో ఆమె చేసిన ఫొటోషూట్‌కు సంబంధించిన చిత్రాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆధునిక డిజైన్‌తో ఉన్న బ్లాక్ డ్రెస్‌లో నువేక్ష గ్లామరస్‌గా కనిపిస్తూ కెమెరాకు వివిధ రకాల పోజులు ఇచ్చారు. సహజమైన అందానికి తగ్గట్టుగా సింపుల్ మేకప్, స్టైలిష్ హెయిర్‌స్టైల్‌తో ఆమె లుక్‌ను మరింత ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఫ్యాషన్ విషయంలో ఎప్పటికప్పుడు కొత్త లుక్స్‌ను ప్రయత్నించే నువేక్ష.. తాజా ఫొటోషూట్‌లోనూ తన ప్రత్యేక శైలిని చూపించారు. బ్లాక్ డ్రెస్‌కు అనుగుణంగా ఎంచుకున్న యాక్సెసరీస్, మేకప్ ఆమె లుక్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. ఫొటోల్లో ఆమె ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్, పోజులు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఫొటోలను చూసిన అభిమానులు తమకు నచ్చిన కామెంట్లతో స్పందిస్తున్నారు. మోడలింగ్ రంగం నుంచి వినోద పరిశ్రమలోకి అడుగుపెట్టిన నువేక్ష.. తెలుగు చిత్రాల్లో తనదైన గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. విభిన్న కథాంశాలతో వచ్చిన సినిమాల్లో నటిస్తూ తన నటనా సామర్థ్యాన్ని ప్రదర్శించారు. 'ఇప్పుడు కాక ఇంకెప్పుడు', 'అతిథి దేవోభవ', 'సెబాస్టియన్ పీసీ 524', 'హిట్: ది ఫస్ట్ కేస్', 'రోటి కపడా రొమాన్స్' వంటి చిత్రాల్లో ఆమె కనిపించారు. నటిగా సినిమాల్లో కొనసాగుతూనే సోషల్ మీడియా ద్వారా తన అభిమానులకు మరింత చేరువగా ఉంటున్నారు.సినిమా కార్యక్రమాలు, ఫొటోషూట్లు, ఫ్యాషన్ లుక్స్‌కు సంబంధించిన చిత్రాలను నువేక్ష ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటుంటారు. దీంతో ఆమె పోస్టులకు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. తాజాగా బ్లాక్ డ్రెస్‌లో కనిపించిన ఈ లుక్ కూడా అదే తరహాలో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం నువేక్షకు సంబంధించిన ఈ ఫొటోలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.





# ప్యారడైజ్‌లో బాబు మోహన్.. అసలేం జరిగింది?

**హైదరాబాద్, మహా:** నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ది పారడైజ్' ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్‌బాబు కీలక ప్రతినాయక పాత్రలో కనిపించగా.. పలువురు నటీనటులు కూడా ముఖ్యమైన పాత్రలు పోషించారు. అయితే ప్రముఖ హాస్యనటుడు బాబు మోహన్ ఈ సినిమాలో నటించనున్నారనే వార్తలు గతంలో వచ్చినప్పటికీ.. విడుదలైన చిత్రంలో ఆయన కనిపించకపోవడం ఆసక్తికరంగా మారింది. వాస్తవానికి 'ది పారడైజ్' కోసం బాబు మోహన్ లుక్ టెస్ట్‌లో పాల్గొన్నట్లు గతంలో వెల్లడైంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఆయన లుక్‌పై సంతృప్తి వ్యక్తం చేసినట్లు కూడా బాబు మోహన్ ఓ సందర్భంలో చెప్పినట్లు సమాచారం. దీంతో సినిమాలో ఆయనకు కీలకమైన పాత్ర ఉంటుందని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే లుక్ టెస్ట్ పూర్తయినప్పటికీ ఆయన చిత్రీకరణలో పాల్గొనలేదని తాజాగా వచ్చిన వివరాలు సూచిస్తున్నాయి. సినిమా కథను మరింత మెరుగ్గా తీర్చిదిద్దే క్రమంలో కొన్ని పాత్రలను తొలగించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో బాబు మోహన్ పాత్ర కూడా తుది కథలో లేకుండా పోయినట్లు సమాచారం. అందుకే సినిమా విడుదలైన తర్వాత ఆయనకు సంబంధించిన ఒక్క సన్నివేశం కూడా తెరపై కనిపించలేదు. అయితే ఆయన పాత్రను ఎందుకు తొలగించారనే విషయంపై చిత్రబృందం నుంచి స్పష్టమైన అధికారిక వివరణ మాత్రం వెలువడలేదు. ఇక 'ది పారడైజ్'లో మోహన్‌బాబు శికంజా మాలిక్ అనే ప్రతినాయక పాత్రలో నటించారు. ఈ పాత్ర తన కెరీర్‌లోనే చాలా భిన్నమైనదని మోహన్‌బాబు ఇటీవల వెల్లడించారు. బాబు మోహన్ కూడా సినిమాలో కనిపించి ఉంటే కథలో మరో రకమైన ఆకర్షణ ఉండేదని అభిమానులు చర్చించుకుంటున్నారు. అయితే దర్శకుడు కథనం, పాత్రల అవసరాలకు అనుగుణంగా తుది మార్పులు చేసినట్లు తెలుస్తోంది.




# అర్ధరాత్రి మైకుల మోతపై శిరీష్ ఫిర్యాదు

**హైదరాబాద్, మహా:** నగరంలో శబ్ద కాలుష్యంపై సినీ నటుడు అల్లు శిరీష్ పోలీసులను ఆశ్రయించారు. షేక్‌పేటలోని తన నివాసానికి సమీపంలో ఉన్న వినోభానగర్ హనుమాన్ ఆలయం వద్ద రాత్రివేళల్లో అధిక శబ్దంతో లౌడ్‌స్పీకర్లు వినిపిస్తున్నాయని ఆయన హైదరాబాద్ సిటీ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్య కారణంగా స్థానికంగా నివసించే వృద్ధులు, చిన్నారులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శిరీష్ పేర్కొన్నారు. అల్లు శిరీష్ తన సోషల్ మీడియా పోస్టులో.. గత కొన్ని రోజులుగా రాత్రి 2 నుంచి 3 గంటల వరకు కూడా భారీ శబ్దంతో సంగీతం వినిపిస్తున్నట్లు తెలిపారు. అనుమతించిన డెసిబెల్ స్థాయికి మించి శబ్దం వస్తోందని ఆయన ఆరోపించారు. దీనిపై ఇప్పటికే ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. గణేశ్ నిమజ్జనం కార్యక్రమాల కారణంగా సెప్టెంబర్ 25 వరకు సహకరించాలని పోలీసులు సూచించినట్లు ఆయన తెలిపారు. అయితే నిమజ్జనం పూర్తయిన తర్వాత కూడా శబ్దం కొనసాగుతోందని శిరీష్ పేర్కొన్నారు. గతంలోనూ ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ పరిష్కారం లభించలేదని తెలిపారు. రాత్రి వేళల్లో అధిక శబ్దం కారణంగా ప్రశాంతంగా నిద్రపోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ.. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ పోలీసులను కోరారు. శిరీష్ ఫిర్యాదుపై హైదరాబాద్ సిటీ పోలీసుల అధికారిక ఖాతా స్పందించింది. ఈ విషయాన్ని ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు పంపించి అవసరమైన చర్యలు తీసుకునేలా సూచించినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి వేళల్లో శబ్ద కాలుష్యంపై అల్లు శిరీష్ చేసిన ఫిర్యాదు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.



## బాహుబలి సీన్‌తో
# ఇరాన్ సందేశం




**హైదరాబాద్, మహా:** తెలుగు సినిమా సన్నివేశం ఇప్పుడు అంతర్జాతీయ దౌత్య సందేశంలో భాగమైంది. హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ ప్రభాస్ నటించిన 'బాహుబలి: ది బిగినింగ్' చిత్రంలోని కీలకమైన యుద్ధ సన్నివేశాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు అనుసంధానంగా ఈ వీడియోను పోస్ట్ చేసింది. ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'బాహుబలి: ది బిగినింగ్'లో అమరేంద్ర బాహుబలి పాత్రలో ప్రభాస్ నటించారు. సినిమాలో కాలకేయుల సైన్యంతో బాహుబలి పోరాడే సన్నివేశాన్ని ఇరాన్ కాన్సులేట్ తన పోస్టులో ఉపయోగించింది. బలమైన ప్రత్యర్థిని ఎదుర్కొంటూ వెనక్కి తగ్గని బాహుబలి పాత్రను తమ సందేశానికి ప్రతీకగా చూపించింది. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఐరాస వేదికగా ఒత్తిళ్లకు తలొగ్గబోమనే వైఖరిని వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ పోస్టు వెలువడింది. ఒత్తిడి ఉన్నప్పటికీ తమ దేశం వెనక్కి తగ్గదనే భావాన్ని బాహుబలి యుద్ధ సన్నివేశంతో ముడిపెట్టింది. అదే సమయంలో ఇరాన్ దౌత్యం, చర్చలకు సిద్ధంగా ఉందని కూడా పెజెష్కియాన్ పేర్కొన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు తెలిపాయి. ఇరాన్ కాన్సులేట్ తెలుగు సినిమాను తన అంతర్జాతీయ సందేశంలో ఉపయోగించడం సోషల్ మీడియాలో ప్రత్యేకంగా చర్చకు దారితీసింది. గతంలోనూ ఇరాన్ దౌత్య సంస్థలు తెలుగు సినిమాలకు చెందిన యాక్షన్ సన్నివేశాలను తమ పోస్టుల్లో ఉపయోగించిన విషయం తెలిసిందే. తాజాగా ప్రభాస్ 'బాహుబలి' సీన్‌ను ఎంచుకోవడంతో తెలుగు సినిమా అభిమానుల దృష్టిని ఆకర్షించింది. అంతర్జాతీయ రాజకీయ అంశానికి భారతీయ సినిమా సన్నివేశాన్ని ప్రతీకగా ఉపయోగించడం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముఖ్యంగా 'బాహుబలి'లోని యుద్ధ ఘట్టాన్ని ఇరాన్ తన సందేశంతో అనుసంధానించడం సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచింది.



# 400 కోట్ల క్లబ్‌లో హనుమాన్ అంశ్

హైదరాబాద్, మహా: ఆధ్యాత్మిక కథాంశంతో తెరకెక్కిన 'హనుమాన్ అంశ్' బాక్సాఫీస్ వద్ద సుదీర్ఘమైన విజయవంతమైన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. విడుదలై 52 రోజులు పూర్తయినా వసూళ్లలో జోరు తగ్గకపోవడం విశేషం. ఎనిమిదో వారంలోనూ ప్రేక్షకుల ఆదరణను అందుకుంటున్న ఈ చిత్రం తాజాగా ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటింది. ఆదివారం 52వ రోజున ఈ సినిమా దేశీయంగా రూ.9 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ గణాంకాలు వెల్లడించాయి. దీంతో భారత్‌లో మొత్తం నెట్ కలెక్షన్లు రూ.307.03 కోట్లకు చేరాయి. ఇండియా గ్రాస్ వసూళ్లు రూ.362.70 కోట్లుగా నమోదయ్యాయి. ఓవర్సీస్ మార్కెట్ల నుంచి ఇప్పటివరకు రూ.38.50 కోట్ల గ్రాస్ రాబట్టింది. దీంతో ప్రపంచవ్యాప్త గ్రాస్ రూ.401.20 కోట్లకు చేరుకుంది. 52వ రోజు దేశవ్యాప్తంగా 4,387 షోల ద్వారా ఈ వసూళ్లు నమోదయ్యాయి. ఆదివారం మొత్తం ఆక్యుపెన్సీ 46 శాతంగా నమోదైనట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. అంతకు ముందు 51వ రోజున రూ.6.50 కోట్ల నెట్ రాబట్టిన ఈ చిత్రం.. ఒక్కరోజులోనే గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. ముఖ్యంగా ఆదివారం సాయంత్రం షోలకు ఆక్యుపెన్సీ 75 శాతానికి చేరుకోవడం ప్రేక్షకుల ఆసక్తిని తెలియజేస్తోంది.కొత్త సినిమాలు థియేటర్లలోకి వచ్చినప్పటికీ 'హనుమాన్ అంశ్' తన ప్రదర్శనను కొనసాగిస్తోంది. నాని నటించిన 'ది పారడైజ్', సిద్ధార్థ్ మల్హోత్రా నటించిన 'ది వ్యాన్-ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' వంటి చిత్రాల పోటీ మధ్య కూడా ఈ సినిమా ఎనిమిదో వారంలో వసూళ్లు సాధించడం ట్రేడ్ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది.విశాల్ చతుర్వేది దర్శకత్వంలో రూపొందిన ఈ ఆధ్యాత్మిక డ్రామాలో శోభినవ్ సత్యా, విహాన్ షెడ్గే ప్రధాన పాత్రల్లో నటించారు. స్వాతంత్ర్యానికి ముందు కాలం నేపథ్యంలో తెరకెక్కిన ఈ కథలో లక్ష్మీనారాయణ్ జీవిత ప్రయాణం, అనంతరం ఆయన నీమ్ కరోలి బాబాగా మారిన పరిణామాలను చూపించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com